# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2

ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ సోమవారం 22-4-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :30 సంచిక:200 పేజీలు:6 వెల: రూ.1/-


## కేరళలో బర్డ్ ఫ్లూ కలకలం.. కోయింబత్తూరులో హై అలర్ట్..!

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21: కేరళ రాష్ట్రం అలప్పుజా జిల్లాలోని రెండు గ్రామాల్లో బర్డ్ ఫ్లూ కలకలం రేగడంతో తమిళనాడులోని కోయింబత్తూరు జిల్లా పరిపాలనా యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లావ్యాప్తంగా హైఅలర్ట్ ప్రకటించింది. కేరళ సరిహద్దుల్లోని 12 చెక్‌పోస్టుల దగ్గర నిఘాను కట్టుదిట్టం చేసింది. కేరళలోని అలప్పుజా జిల్లాతో తమిళనాడులోని కోయింబత్తూరు జిల్లా సరిహద్దు కలిగి ఉండటంతో అధికారులు ఈ జాగ్రత్తలు తీసుకున్నారు.

అయితే కేరళ నుంచి బర్డ్ ఫ్లూ జిల్లాలోకి ప్రవేశించకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టామని, ఇందులో జిల్లా ప్రజలు అంతగా భయపడాల్సింది ఏమీ లేదని కోయింబత్తూరు పరిపాలనా యంత్రాంగం ప్రకటించింది. కేరళ ప్రభుత్వం అలప్పుజాలోని బాతుల్లో హెచ్1ఎన్1 రకం బర్డ్ ఫ్లూను గుర్తించింది. ఆ బాతుల బ్లడ్ శాంపిల్స్‌ను పరీక్షల కోసం భోపాల్‌లోని 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హై సెక్యూరిటీ యానిమల్ డిసీజెస్'కు పంపింది.

ఇదిలావుంటే కేరళ నుంచి కోయింబత్తూరులోకి ప్రవేశించే వాహనాలను పూర్తిగా శానిటైజ్ చేస్తున్నామని జిల్లా అధికార యంత్రాంగం తెలిపింది. ప్రత్యేకించి వలయార్, వెలంతవాలమ్, మీనాక్షిపురం, గోపాలపురం చెక్‌పోస్టుల దగ్గర నిఘాను పెంచినట్లు వెల్లడించారు. పౌల్ట్రీ రవాణాకు సంబంధించిన వాహనాలను కేరళ నుంచి జిల్లాలోకి అనుమతించడం లేదని చెప్పారు.

## బీజేపీది ప్రజల మేనిఫెస్టో- కిషన్‌రెడ్డి



హైదరాబాద్, ఏప్రిల్ 21: బీజేపీ మేనిఫెస్టో ప్రజల మేనిఫెస్టో అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ నేతలతో కలిసి బీజేపీ లోక్ సభ ఎన్నికల మేనిఫెస్టో తెలుగు వెర్షన్ 'మన మోడీ గ్యారంటీ 2024' పేరుతో విడుదల చేశారు.

ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ మోడీ గ్యారంటీ అంటే కచ్చితంగా అమలుచేసేస్తారని చెప్పారు. 2047 వికసిత భారత్ పేరుతో బీజేపీ ముందుకెళ్తోందన్నారు. అవినీతి, బంధుప్రీతిని కాంగ్రెస్ పూర్తిగా వదిలిపెట్టలేదని విమర్శించారు. కాగా మోడీ గ్యారెంటీ, 2047 నాటికి వికసిత భారత్ థీమ్ తో బీజేపీ రూపొందించిన జాతీయ మేనిఫెస్టోను వారం ప్రధాని మోడీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, మంత్రులు అమిత్ షా, రాజ్ నాథ్ సింగ్, నిర్మలా సీతారామన్ తదితరులు కలిసి విడుదల చేయగా తాజాగా ఇవాళ తెలంగాణలో తెలుగు మేనిఫెస్టోను రాష్ట్ర నేతలు విడుదల చేశారు. కాగా బీజేపీ ప్రకటించిన మేనిఫెస్టోలో 14 అంశాలను చేర్చారు. మూడు కోట్ల ఇళ్ల నిర్మాణం, మరో ఐదేళ్లు ఉచిత రేషన్, పైప్ లైన్ ద్వారా ఇంటింటికీ వంట గ్యాస్, ముద్ర రుణాల పరిమితి రూ. 20 లక్షల వరకు పెంపు, ఎప్పటికప్పుడు పంటల మద్దతు ధర పెంపు వంటి ముఖ్యమైన హామీలు ఉన్నాయి.

సమాజంలోని అట్టడుగున ఉన్న యువకులు, మహిళలు, పేదలు, రైతుల అభ్యున్నతికి పాటుపడుతామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి అన్నారు? పంటల బీమా మరింత సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు భారతదేశాన్ని మిల్లెట్ హబ్ గా మర్చుతామని అన్నారు. భారతదేశ ఆర్థిక వ్యవస్థను ప్రపంచంలోనే అతి పెద్ద మూడవ ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దనున్నట్లు చెప్పారు. నాణ్యమైన విద్య, అందరికీ ఆరోగ్యం, పేదలకు పక్కా ఇళ్లు గ్యారంటీతో పాటు మరో ఐదేళ్ల వరకు ఉచిత బియ్యం ఇచ్చే కార్యక్రమం కొనసాగుతుందని చెప్పారు. పేపర్ లీకేజీ అరికట్టే విషయంలో కఠిన చట్టాలు తీసుకొచ్చామని, పోస్టాఫీసులను మినీ బ్యాంకులుగా మార్చేస్తున్నామని, భారత్ ను సర్వీస్ సెక్టార్ హబ్ గా విస్తరిస్తామని అన్నారు. మత్స్యకారులను అన్ని రకాలుగా ఆదుకుంటామని దేశ భవిష్యత్ కోసమే వన్ నేషన్ వన్ ఎలక్షన్ ఆలోచన అన్నారు.

## రైల్వేలను నిర్వీర్యం చేసి స్నేహితులకు కట్టబెట్టేందుకు మోదీ స్కెచ్ : రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21: నరేంద్ర మోదీ ప్రభుత్వం రైల్వేలను నిర్వీర్యం చేస్తోందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విమర్శలు గుప్పించారు. కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వ హయాంలో రైలు ప్రయాణం శిక్షగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రయాణీకులు తమ రైలు ప్రయాణంలో అసౌకర్యానికి గురైన వీడియో క్లిప్‌ను రాహుల్ సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో షేర్ చేశారు.

విలాసవంతమైన రైళ్లను ప్రోత్సహిం చేందుకు మోదీ ప్రభుత్వం సామాన్యులు ప్రయాణించే రైళ్లలోని జనరల్ కోచ్‌ల సంఖ్యను తగ్గించడంతో సాధారణ ప్రయాణీకులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని రాహుల్ గాంధీ ఈ పోస్ట్ లో రాసుకొచ్చారు. టికెట్లు కన్‌ఫాం అయిన ప్రయాణీకులు కూడా ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

సామాన్య ప్రయాణీకులు రైలు ఫ్లోర్‌పై కూర్చోవడంతో పాటు టాయ్‌లెట్స్‌లో బలవంతంగా ప్రయాణించాల్సి వస్తోందని అన్నారు. టికెట్స్ కన్‌ఫాం అయిన ప్రయాణీకులు సైతం తమ సీట్లలో కూర్చోలేకపోతున్నారని అన్నారు. రైల్వేలను బలహీనపరిచి దాన్ని తన స్నేహితులకు విక్రయించాలని బీజేపీ కోరుకుంటోందని దుయ్యబట్టారు. సామాన్య ప్రయాణీకులను కాపాడాలంటే రైల్వేలను దోచుకుంటున్న మోదీ ప్రభుత్వాన్ని సాగనంపాలని రాహుల్ గాంధీ ప్రజలను కోరారు.

## కాంగ్రెస్‌కు 300 స్థానాల్లో పోటీ చేసే సత్తా లేదు : ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21: కాంగ్రెస్ పార్టీ పరిస్థితి నానాటికీ దిగజారుతోందనీ, గతంలో 400 స్థానాల్లో గెలిచిన ఆపార్టీకి ప్రస్తుతం 300 స్థానాల్లో పోటీ చేసే సత్తా కూడా లేదని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. కాంగ్రెస్ పార్టీ అస్థిరతకు మారుపేరని వ్యాఖ్యానించారు. రాజస్థాన్‌లోని జలోర్‌లో ఆదివారం జరిగిన ప్రచార ర్యాలీని ఉద్దేశించి ప్రధాని మాట్లాడుతూ కాంగ్రెస్ చేసిన పాపాలకు దేశ ప్రజలు ఆ పార్టీని శిక్షిస్తున్నారని అన్నారు. మీరు ప్రతిసారీ బీజేపీకి ఆశీస్సు లు ఇచ్చిన మాదిరిగా ఈ ఎన్నికల్లోని కాషాయ పార్టీకి అండగా నిలవాలని కోరారు. తొలి దశ పోలింగ్‌లో రాజస్థాన్‌లోని పలు నియోజకవర్గాలు కాంగ్రెస్‌కు గుణపాఠం నేర్పాయని చెప్పారు. కేంద్రంలో కాంగ్రెస్ స్థిరమైన ప్రభుత్వాన్ని అందించలేదని రాజస్థాన్ ప్రజలకు తెలుసునని అన్నారు.



కాంగ్రెస్ ప్రభుత్వం రిమోట్ కంట్రోల్‌తో నడిచేదని, 2014కు ముందున్న పరిస్థితులు తిరిగి రావాలని దేశం కోరుకోవడం లేదని ప్రధాని మోదీ పేర్కొన్నారు. కాంగ్రెస్ మాజీ చీఫ్ పార్లమెంట్‌లో అడుగుపెట్టేందుకు రాజ్యసభ మార్గాన్ని ఎంచుకున్నారని సోనియా గాంధీ పేరు ప్రస్తావించకుండా ప్రధాని వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో విజయం సాధించలేమని తెలుసుకున్న నేతలు రేసు నుంచి తప్పుకుని రాజస్థాన్ నుంచి రాజ్యసభకు వెళుతున్నారని ఎద్దేవా చేశారు.

## కరాటేతో ఆత్మ విశ్వాసం ఆత్మ స్థైర్యం పెంపొందుతాయి

### -వివేకానంద రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపల్ శ్రీమతి రేణుక

### -కరాటే బెల్ట్‌లు, సర్టిఫికెట్‌ల ప్రధానోత్సవం

కరీంనగర్,ఏప్రిల్ 21: (నేటినిజం ప్రతినిధి) :కరాటే తో ఆత్మ విశ్వాసం ఆత్మ స్థైర్యం పెంపొందుతాయిని వివేకానంద రెసిడెన్షియల్ ప్రిన్సిపల్ శ్రీమతి రేణుక బాలివాడ అన్నారు.. శనివారం కరీంనగర్ పట్టణం జగిత్యాల్ రోడ్ లో గల వివేకానంద రెసిడెన్షియల్ ట సి. బి. ఎస్. ఈ ) పాఠశాల లో శనివారం ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో 2023-24 విద్యా సంవత్సరం కరాటే లో శిక్షణ పొందిన విద్యార్థిని,విద్యార్థులకు కలర్ బెల్ట్ అప్



గ్రేడింగ్ టెస్ట్, సర్టిఫికెట్స్ ల ప్రధానోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వివేకానంద రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీమతి రేణుక బలి వాడ హాజరయ్యారు. ఈ సందర్భంగా రేణుక మాట్లాడుతూ కరాటే అనేది అతి ప్రాచీనమైన యుద్ధ విద్య అని అన్ని యుద్ధ విద్యలకు కరాటే మాతృ కళ అని అన్నారు.అలాగే కరాటే నేర్చుకొని అందులో సాధించే ఎస్జీఎఫ్ఐ సర్టిఫికెట్స్ ద్వారా భవిష్యత్తులో ఉన్నత విద్య మరియు ఉన్నతమైన ఉద్యోగాలు స్పోర్ట్స్ రిజర్వేషన్ కోటాలోసాధించడానికి అవకాశం ఉంటుందని విద్యార్థులకు ఈ సందర్భంగా తెలియజేశారు. అంతేకాకుండా విద్యార్థిని విద్యార్థులకు కరాటే లోని మెలకువలు వాటిని సాధించే ప్రక్రియలలో క్రమశిక్షణ అలాగే సమాజంలో జరిగే విపత్కర పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలో ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులకు వివరించారు.

వివేకానంద రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులు జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయి మరియు జాతీయ స్థాయి కరాటే పోటీల్లో పాల్గొనటమే కాకుండా పథకాలు సాధించటం అభినందనీయం అని అన్నారు. విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో రాణించాలన్నారు..ఈ కార్యక్రమానికి చీఫ్ ఎగ్జామినర్ గా తెలంగాణ రాష్ట్ర కరాటే అసోసియేషన్ చైర్మన్ ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ డిప్యూటీ గ్రాండ్ మాస్టర్ కె వసంత్ కుమార్ హాజరై పిల్లల యొక్క శక్తి సామర్థ్యాలు ప్రతిభా పాటవాలను పరీక్షించి అందులో ఉత్తమ ప్రతిభా పాటవాలు అత్యంత నైపుణ్యం కనబర్చిన పిల్లలకి బెల్టులు, సర్టిఫికెట్లు అందజేశారు. వివిధ బెల్టు సాధించిన విద్యార్థులకు పాఠశాల చైర్మన్ డాక్టర్ సుధాకర్ రావు, డైరెక్టర్ (అకాడమిక్ ) టీ. లత కుమారి వైస్ ప్రిన్సిపల్ మొగిలి ప్రశాంత్,ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు అభినందించారు.

## వీరభద్రం కుమారుడి వివాహ వేడుకలో పలువురు



ఖమ్మం, ఏప్రిల్ 21: (నేటనిజం ప్రతినిధి): ప్రముఖ అంబేద్కర్ వాది, సీనియర్ ఉద్యమకారుడు, గుంతేటి వీరభద్రం కుమారుడి వివాహ వేడుకకు హాజరై వధూవరు లకు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్ర పటాన్ని బహుకరించి శుభాకాంక్షలు తెలి పారు. వీర వీరనారీమణుల ఆశయ సాధన సమితి తెలంగాణ రాష్ట్ర కమిటీ ఎల్ హెచ్ పిఎస్ కమిటీలు సం యుక్తంగా వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఎల్ హెచ్ పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానో త్ భద్రు నాయక్, జిల్లా ఉపాధ్య క్షులు వీరన్న నాయక్, రవీందర్ నా యక్, వీరనారీమణుల ఆశయ సాధన కమిటీ గౌరవ అధ్యక్షురాలు షేక్ నజీమా, కమిటీ కన్వీనర్ ఉపేంద్ర బాయ్, కో-కన్వీనర్ మామిడాల ఝాన్సీ, జిల్లా నాయకురాలు లక్ష్మి, కృష్ణవేణి, చందు, తదితరులున్నారు.

## కేసీఆర్ పని అయిపోయింది..కిషన్ రెడ్డి

**-రేవంత్ మాట తప్పిన నమ్మక ద్రోహి**

**-బిజెపి ఒక్కటే తెలంగాణకు అండా , దండా**

**-మోదీ లేని దేశాన్ని ఊహించలేం**

**-ఈ ఎన్నికలు ప్రధాని పీఠంపై ఎవరనేదే**

**-ఎన్నికల ప్రచారంలో కిషన్ రెడ్డి కామెంట్స్**

హైదరాబాద్, ఏప్రిల్ 21: కేసీఆర్ పోయిండు.. ఆయన పని అయిపోయింది.. కేసీఆర్ ఇక రాడు అంటూ కేంద్ర మంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఆయన కుటుంబం తెలంగాణను దోచుకుంటే అలవికాని వాగ్దానాలతో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రజలను నమ్మక ద్రోహం చేసిందన్నారు.. కేసీఆర్ బస్సు యాత్ర ఎందుకు చేస్తున్నారో కూడా తెలియదన్నారు. కేసీఆర్ పని అయిపోయిందని, కేసీఆర్ ఎన్ని యాత్రలు చేసిన కూడా ప్రజలు నమ్మరు.. ఓట్లు పడవని అన్నారు? యూసుఫ్ గూడ కృష్ణానగర్ లో జైన్ మందిర్ ను నేడు ఆయన సందర్శించారు. అనంతరం మహావీర్ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. ఆ తర్వాత జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని యూసుఫ్ గూడ, శ్రీనగర్ నగర్ డివిజన్, హైలైన్ కాలనీ నుంచి కిషన్ రెడ్డి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు.

**మోదీ లేని దేశాన్ని ఊహించలేం..**

ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ, మోడీ లేని భారతదేశాన్ని ఊహించలేమన్నారు. దేశానికి ఎవరు ప్రధాని కావాలో.. ఏ పార్టీ అధికారంలో ఉండాలో నిర్ణయించే ఎన్నికలు ఇవి అని తెలిపారు. మోడీ నాయకత్వంలోనే మనం కొనసాగాలన్నారు. దేశంలోని అనేక సమస్యలను మోదీ పరిష్కరించారన్నారు.

**25న అమిత్ షా ప్రచారం..**

కేంద్ర హోం మంత్రి 25వ తేదీన అమిత్ షా తెలంగాణకు వస్తున్నారని తెలిపారు కిషన్ రెడ్డి. ఒక పార్లమెంట్ సెగ్మెంట్ లో ఆయన సభ ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే విడదల వారిగా జాతీయ నేతల సభలు ఉంటాయని, ప్రచారంలో పాల్గొంటారని తెలిపారు. అలాగే మోదీ కూడా తెలంగాణలో ప్రచారంలో పాల్గొంటా రని అన్నారు. సభల కంటే ఓటర్లను రీచ్ అయ్యేలా కార్యక్రమాలు చేస్తామన్నారు.

## తన్మయి చౌదరికి ఎంపీ వద్దిరాజు ఆశీస్సులు



ఖమ్మం, ఏప్రిల్ 21: (నేటినిజం ప్రతినిధి): రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర పెళ్లి కూతురు తన్మయి చౌదరిని ఆశీర్వదించారు. ఖమ్మంకు చెందిన కనపర్తి వెంకటేశ్వరరావు-భవానిల ఏకైక కుమార్తె తన్మయి పెళ్లి హైదరాబాద్ నగరానికి చెందిన కృష్ణసాయి తో ఆదివారం రాత్రి బోనకల్ రోడ్డు శ్రీలక్ష్మి గార్డెన్స్ లో జరుగుతుంది. ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర తన కుమారుడు నిఖిల్ చంద్రతో కలిసి ఖమ్మం మూలగుండ్ల రాఘవయ్య నగర్ లోని వెంకటేశ్వరరావు నివాసానికి వెళ్లి అక్షింతలు వేసి పెళ్లి కూతురు తన్మయికి ఆశీస్సులుఅందజేశారు. ఆమె తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

## సాగర్‌ను ఎడారిగా మారిన కాంగ్రెస్‌కు ఓటుతో బుద్ధి చెప్పాలి : జగదీశ్‌రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 21: నాగార్జున సాగర్ ఆయకట్టు ను ఎడారిగా మార్చిన కాంగ్రెస్ పార్టీకి ఓటుతో బుద్ధి చెప్పాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. నల్గొండ పార్లమెంట్ అభ్యర్థి కృష్ణారెడ్డికి మద్దతుగా ఆయన సాగర్ నియోజకవర్గంలోని గుర్రం పోడ్‌లో రోడ్‌షో నిర్వహించారు. జగదీశ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజర య్యారు. సాగర్ ప్రాజెక్టులో నీళ్లున్నా.. కాంగ్రెస్ నాయకుల అలసత్వం, ఉదాసీనత వైఖరితో ఆయకట్టు అంతా సర్వనాశనమైందని ఆరోపించారు.సాగర్‌లో కొత్తగా గెలిచిన ఎమ్మెల్యేకు తలాతోక తెలియదని.. ఎందుకు గెలిపించారో ఎవరికీ అర్థం కావడం లేదన్నారు. కేసీఆర్ సీఎంగా ఉన్న సమయంలో సాగర్ ఆయకట్టు కింద చివరి భూములకు నీళ్ల అందించామన్నారు.

### నేటి కందం- నేటికీ అందం

బ్రాజిత ఐ సీ ఎస్ లో
పూజితుడై చెలగి కూడ పూతాశయుడై
రాజీనామా నిడె-నే
తాజీ-దేశమును గొలువ తనదగు శైలిన్

(22-4-1921 స్వాతంత్ర్య సమరం లో దూకడానికి నేతాజీ బోస్ తన ఎఐూ పదవికి రాజీనామా చేసినరోజు)



-రాధశ్రీ

సెల్:9494481210

## రాజకీయ పార్టీల ఉచిత హామీలపై శ్వేతపత్రం తీసుకురావాలి : ఆర్‌బిఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21: ఉచిత హామీల విషయంలో రాజకీయ పార్టీలపై ఎలా ఆంక్షలు విధించాలన్న అంశంపై సమగ్రంగా చర్చ జరగాల్సిన అవసరం ఉందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు అన్నారు. ఈ విషయంలో పార్టీల మధ్య ఏకాభిప్రాయం కుదరాల్సిన అవసరం ఉందన్నారు. ఈ అంశంలో రాజకీయ పార్టీలను ఎలా కట్టడి చేయాలనే దానిపై లోతైన చర్చ జరగాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఉచితాల ఖర్చు, ప్రయోజనాలపై సాధారణ ప్రజలకు మరింత అవగాహన కల్పించాలన్నారు. ప్రజలకు ఎలా విద్యనందించాలనే దానిపై అవగాహన కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని మాజీ గవర్నర్ అన్నారు. ఇది రాజకీయ అంశమని.. దీనిపై రాజకీయంగా ఏకాభిప్రాయం ఉండాలని భావిస్తున్నానన్నారు. దానికి కేంద్ర ప్రభుత్వం, ప్రధానమంత్రి నాయకత్వం వహించాలన్నారు. ఇందు కోసం శేతపత్రం విడుదల చేసి.. దానిపై ఏకాభిప్రాయం కోసం ప్రయత్నించాలన్నారు.

ఫ్రీబీస్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. దీన్ని ఎలా అరికట్టగలమో.. ఎలా అమలు చేయగలమో ప్రభుత్వం నిర్ధారించాల్నారు. భారత్‌లాంటి పేద దేశంలో అత్యంత బలహీన వర్గాలకు కొంత భద్రత కల్పించడం ప్రభుత్వం బాధ్యత అన్న ఆయన.. ఆర్థిక పరిమితుల దృష్ట్యా ఉంచుకొని వాటిని ఎంత వరకు అమలు చేయగలమో సమీక్షించాల్సిన అవసరం ఉందన్నారు. ఉచిత హామీలపై మరింత అవగాహన ఉండాలని భావిస్తున్నానన్నారు. అదే సమయంలో తీవ్రంగా చర్చించాలని.. రాజకీయ పార్టీలపై నియంత్రణ ఎలా విధించవచ్చో మార్గం కనుగొనాలన్నారు.

## బాసరలో మంత్రి సీతక్క పర్యటన



బాసర,ఏప్రిల్ 21: రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క ఇవాళ బాసరలో పర్యటిస్తున్నారు.

బాసర మండల కేంద్రంలో ఆమె కాంగ్రెస్ అదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి మాత్రం సుగుణక్కతో కలసి శారదా నగర్ లోని హనుమాన్ మందిరంలో ప్రత్యేక పూజలు చేసి కాంగ్రెస్ పార్టీ ప్రచారాన్ని ప్రారంభించారు.

అంతకుముందు బాసర చేరుకున్న మంత్రి సీతక్క కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణక్క ను మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ సర్పంచ్ రమేష్, లక్ష్మణరావు, సంజీవ రావు దేశ్ముక్ ఇతర కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనా స్వాగతం పలికారు. రవీంద్రపూర్ , శారద నగర్, అంబేద్కర్ కాలనీ మైలాపూర్ లో మంత్రి సీతక్కతో పాటు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆత్రం సుగుణక్క విస్తృత ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చేయి గుర్తుకేజ్ ఓటు వేసి ఆత్రం సుగుణకను భారీ మెజార్టీతో గెలిపించాలని మంత్రి సీతక్క ఓటర్లను కోరారు.

కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని, త్వరలోనే రైతు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. మహిళలకు ఆర్టీసీ బస్సులలో మహిళలకు రాయితీ ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రైతుబంధు తో పాటు ఇతర పథకాలను అమలు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పిఎసిఎస్ చైర్మన్ వెంకటేష్ గౌడ్, రాజు దేశాయ్, జిడ్డు మల్లయ్య, ఖలీల్, తదితరులు పాల్గొన్నారు.

# సాగర గర్భంలో ప్లాస్టిక్ గరళ ఉప్పెన..!

## (22 ఏప్రిల్ "ప్రపంచ ధరిత్రి దినోత్సవం" సందర్భంగా)

భూతలంపై 70 శాతం జలావరణమే. జల వనరుల్లో దాదాపు 97 శాతం సాగర జలమే. సముద్రాలు సకల జీవరాసులకు నెలవు. భూగ్రహం మీద వెలసిన మహాద్భుతం మహాసముద్ర సృష్టి మాత్రమే. జీవవైవిధ్యాలకు ఆదరువు, పర్యావరణ పరిరక్షణకు హితవరిగా సముద్రాలు విశ్వమానవాళికి ఎనలేని సేవలను అందిస్తున్నది. సముద్రడిని దైవంగా పూజించడం, తన సంతానంగా లక్ష్మి, చందమామలను భావించడం మన సంప్రదాయంలో ఉన్నది. సముద్రాలు సకల జీవరాశుల ఉనికికి, మనుగడకు ప్రత్యక్ష, పరోక్ష సంబంధాన్ని కలిగి ఉన్నాయి. ధరిత్రిపై జలావరణం, శిలావరణం, జీవావరణం, వాతావరణం ఒక దానితో మరొకటి విడదీయరాని సంబంధాన్ని కలిగి ఉన్నాయి. పర్యావరణంలోని ఈ నాలుగు అంగాలు మానవ కల్పిత కాలుష్య కోరల్లో చిక్కి జీవకోటి మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్నాయి.

### స్విట్జర్లాండ్ "ఎర్థ్ ఆక్షన్" సంస్థ తాజా అధ్యయనాలు:

ప్రపంచంలోని 12 ప్రధాన దేశాలు 60 శాతం అదుపుతప్పిన ప్లాస్టిక్ వ్యర్థ కాలుష్యాలకు కారణం అవుతున్నాయని స్విట్జర్లాండ్ సంస్థ "ఎర్థ్ ఆక్షన్" వెల్లడించడం ప్రమాద హెచ్చరికగా తీసుతోవాలి. వీటిలో ముఖ్య దేశాలుగా చైనా, యూఎస్ఏ, భారత్, బ్రెజిల్, మెక్సికో దేశాల్లో ప్లాస్టిక్ వ్యర్థాల గుట్టలు పేరుకుపోయి నియంత్రణ చేయలేని దుస్థితికి చేరాయని పేర్కొంది. 2024లో 220 మిలియన్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయాయని, ప్రతి ఏట 10 శాతం వరకు ప్లాస్టిక్ వ్యర్థాలు చేరుతున్నాయని వివరించారు. ప్రపంచ జనాభా సాలీనా సగటున 28 కేజీల అదనపు ప్లాస్టిక్ వ్యర్థాలకు కారణం అవుతున్నట్లు తెలుస్తున్నది. ప్లాస్టిక్ వ్యర్థాల కొండలు నియంత్రించలేని స్థాయికి చేరుకున్న దుస్థితిలో రానున్న రోజుల్లో "గ్లోబల్ ప్లాస్టిక్ ఓవర్‌షూట్ డే(ప్రపంచ నియంత్రించలేని ప్లాస్టిక్ కాలుష్య దినం)" కూడా పాటించాల్సిన అనివార్యత ఏర్పడనుందని నివేదిక హెచ్చరించింది. ఏప్రిల్ 2024 నాటికి 50 శాతం, సెప్టెంబర్ 2024 నాటికి 66 శాతం ప్రపంచ జనాభా అదుపుతప్పిన ప్లాస్టిక్ వ్యర్థాల ప్రాంతాల్లో దయనీయంగా జీవిస్తున్నట్లు పేర్కొన్నారు. ఏడాదిలో కనీసం 117 రోజులు ప్లాస్టిక్ వ్యర్థాలు మితిమీరిన స్థాయిలో పేరుకుపోతున్నాయని, భవిష్యత్తులో అణ్వస్త్రాలను మించిన ముప్పు ప్లాస్టిక్ వ్యర్థాల కాలుష్యంలో కలుగవచ్చనే తీవ్ర హెచ్చరికలను నివేదిక బహిర్గత పరిచింది.

### కాలుష్య కేంద్రాలుగా సముద్ర జలాలు:

సముద్ర జలాలు మానవ ప్రగతి రథ గమనాలకు కందెనలుగా పని చేస్తున్నాయి. ఇలాంటి సముద్ర జలాలను, సముద్ర జీవులను, సముద్ర కాలుష్యాలను కట్టడి చేసుకుంటూ కాపాడుకోవడం మన కనీస కర్తవ్యం. ఆధునిక మానవుడి అనాలోచిత, స్వార్థపూరిత కార్యాలతో సముద్రాలు కాలుష్య కేంద్రాలుగా మారుతూ, సముద్ర జీవులను, మానవజాతి ఉనికిని అతి ప్రమాదకర స్థితిలోకి నెట్టుతున్నాయి. సాగర కాలుష్యాల్లో రసాయన, కాంతి, శబ్ద, ప్లాస్టిక్ కాలుష్య రకాలు ఉన్నాయి. సముద్ర కాలుష్యానికి కారణంగా ప్లాస్టిక్, చెత్తాచెదారం, మురికినీరు, సముద్ర తవ్వకాలు, చమురు లీకేజీలు, వ్యవసాయ రంగంలోని పురుగుమందుల వ్యర్థాలు, విషతుల్య రసాయనాలు, గాలి కాలుష్య ఫలిత ఆమ్లత్వం, సముద్ర రవాణ వ్యవస్థలు లాంటివి అతి ముఖ్యమైనవి. సముద్ర కాలుష్యంతో జలాల్లో ఆక్సీజన్ గాఢత తగ్గడం, సముద్ర జీవులు ప్రభావితం కావడం, పగడపు దిబ్బలు విచ్ఛిన్నం కావడం, మానవ ఆరోగ్య దెబ్బతినడం, ఆహార చక్రం కలుషితం కావడం, సముద్ర జీవుల పునరుత్పత్తి విఫలం కావడం లాంటి అవాంఛనీయ ప్రమాదకర మార్పులు ఏర్పడుతాయి.

### ప్లాస్టిక్ కాలుష్య సాగర జలాలు:

సాగర కాలుష్యానికి ప్రధాన కారణంగా ప్రమాదకర ప్లాస్టిక్ అని గుర్తించబడింది. మానవులు వాడి వదిలేసిన ప్లాస్టిక్ వ్యర్థాలు నేల కాలుష్యానికే కాకుండా సముద్ర జలాలకు చేరి సముద్ర జల కాలుష్యానికి కారణం అవుతున్నది. జీవ విచ్ఛిన్నం కావడానికి వందల సంవత్సరాలు తీసుకునే ప్లాస్టిక్స్ వల్ల సముద్ర జీవుల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రతిఏటా 18 బిలియన్ పౌండ్ల ప్లాస్టిక్ వ్యర్థాలు సాగరజలాలను కలుషితం చేస్తున్నాయి. ముఖ్యమైన ప్లాస్టిక్ వ్యర్థాల్లో సింగిల్-యూజ్ ప్లాస్టిక్స్, సిగరెట్ బట్స్, ఆహార పొట్లాలు, ప్లాస్టిక్ బ్రెవరేజ్ బాటిల్స్, ప్లాస్టిక్ బాటిల్ మూతలు, స్ట్రాలు, టేబుల్‌వేర్, ప్లాస్టిక్ బ్యాగులు, స్టిరర్స్ లాంటివి వస్తాయి. సముద్ర జలాల్లో 25 ట్రిలియన్ల ప్లాస్టిక్ పదార్థ వ్యర్థ ముక్కలు ఉన్నాయని, వీటిలో 2.69 లక్షల టన్నులు సముద్ర నీటిపై తేలుతున్నాయని, చదరపు కిమీకు 4 బిలియన్ మైక్రో-ఫైబర్ ప్లాస్టిక్స్ సాగర గర్భానికి చేరుతున్నాయని అంచనా వేశారు. సముద్రానికి చేరిన 80 శాతం ప్లాస్టిక్స్ నేల-ఆధార మూలాలైన పరిశ్రమల వ్యర్థాలు, వ్యర్థాల నియంత్రణ సక్రమంగా లేకపోవడం, వ్యక్తులు వదిలిన వ్యర్థాలు, మురికి నీరు లాంటివి గుర్తించబడినవి. సముద్ర కాలుష్యంతో ప్రతియేటా ఒక మిలియన్ సాగర పక్షులు చనిపోతున్నాయి. సముద్ర గర్భంలో ప్లాస్టిక్ బ్యాగులు, లోహ డబ్బాలు, చేపలు పట్టే పరికరాలు, గాజు బాటిళ్లు, బూట్లు, టైర్లు లాంటి అనేక వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. కొన్ని సముద్ర ప్రాంతాల్లో కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరి, ఆ జలాల్లో ప్రాణవాయువు గాఢత పడిపోవడంతో జీవ మనుగడ సాధ్యపడడం లేదు. ఇలాంటి సముద్ర జలాలున్న ప్రాంతాలను 'డెడ్ జోన్స్' అంటున్నాం. నేడు ప్రపంచవ్యాప్తంగా 500లకు పైగా డెడ్ జోన్లు ఉన్నాయని అంచనా.

### ప్రమాదం అంచున జలచరాలు:

ప్లాస్టిక్ కాలుష్యంతో ప్రతి ఏటా ఒక లక్ష సముద్ర జంతువులు చనిపోతున్నాయి. గాలి కాలుష్యంతో వెలువడిన కార్బన్ వ్యర్థాలు సముద్ర జలాల ఆమ్ల స్వభావాన్ని 150 శాతం పెంచుతున్నాయి. దాదాపు 80 శాతానికి పైగా మురికి నీటిని శుద్ధి చేయకుండానే సముద్రాల్లోకి వదిలి వేయడం జరుగుతోంది. చమురు లీకేజీ వల్ల 12 శాతం, నగరాలు/పరిశ్రమల వల్ల 36 శాతం చమురు సముద్ర జలాల్లో కలుస్తున్నది. పడవలు, ట్యాంకర్లు లాంటి రవాణ యంత్రాల వల్ల సముద్రం శబ్ద కాలుష్యానికి లోనై చేపలు, ఇతర జంతువులకు హానిని కలుగజేస్తుంది. ఇలాగే ప్లాస్టిక్ కాలుష్యం పెరిగితే 2050 నాటికి సముద్రాల్లో చేపల కన్న ప్లాస్టిక్ కలుష్య వ్యర్థాలు అధికం అవుతాయని అంచనా. సముద్ర జంతువులు ఆహారానికి, ప్లాస్టిక్‌కు తేడా గుర్తించనందున, ప్లాస్టిక్‌ను ఆహారంగా భ్రమపడి తినడం జరుగుతుంది. జీర్ణ కావడానికి అవకాశం లేని ప్లాస్టిక్‌తో జంతువులు చనిపోవడం జరుగుతుంది. చైనా, ఇండోనేషియా దేశాలు అధికంగా 33 శాతం ప్లాస్టిక్ కాలుష్యానికి కారణం అవుతున్నాయి. సముద్రజలాల్లో ప్లాస్టిక్ విచ్ఛిన్నం కావడానికి 400 ఏండ్ల సమయం పడుతుంది.

### సముద్ర కాలుష్య కట్టడి:

సముద్ర కాలుష్యాన్ని అరికట్టే మార్గాలుగా చెత్త నియంత్రణ, ప్లాస్టిక్ వాడకాన్ని తగించడం (రెడ్యూజ్), తిరిగి వాడుకోవడం (రీయూజ్), ప్లాస్టిక్ వ్యర్థాలను రీసైకిల్ చేయడం తప్పక జరగాలి. ప్రమాదకర ప్లాస్టిక్‌ను నిషేధించడం, అతి ప్యాకేజీలను తగ్గించడం, షాపింగ్‌కు వెళ్లే సందర్భాల్లో స్వంత బ్యాగులను వెంట తీసుకెళ్లడం, పేపర్ బ్యాగులను వినియోగించడం, ప్లాస్టిక్ కాలుష్యం పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడం, పారిశ్రామిక వ్యర్థాలను శుద్ధి చేసి వదలడం, మురికి నీటిని సముద్రాలు నదుల్లో కలువకుండా చూడడం లేదా శుద్ధి చేసిన తరువాతనే వదలడం, గాలి కాలుష్యాన్ని కట్టడి చేయడం, చమురు లీకేజీలను అరికట్టడం, రేడియోధార్మిక వ్యర్థాలు సముద్రజలాలను చేరకుండా చూడడం, షిప్/ట్యాంకర్ల కదలికలను తగ్గించడం, వేస్ట్/రేయిన్ వాటర్ మేనేజ్‌మెంట్‌ను అభివృద్ధి చేయడం, ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయ గ్రీన్ ఉత్పత్తులను రూపొందించడం లాంటి చర్యలను తీసుకోవాలి. ప్లాస్టిక్ కాలుష్య నియంత్రణలో రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్, రికవర్ మంత్రాలను సదా పాటిద్దాం. సముద్రాలను పరిశుద్ధ దేవాలయాలుగా పూజిద్దాం. మన ఆరోగ్య భవితకు మనమే పునాదులు వేసుకుందాం.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి,
99497 00037

---

జాతీయ సివిల్ సర్వెంట్స్ దినోత్సవం సందర్భంగా..

# జిల్లా ఐఏఎస్ అధికారులకు ఘన సన్మానం




హైదరాబాద్, ఏప్రిల్ 21: (నేటినిజం ప్రతినిధి ):ప్రతి ఏట 21 ఏప్రిల్ రోజున దేశవ్యాప్తంగా "జాతీయ సివిల్ సర్వెంట్స్ దినోత్సవం" ఘనంగా నిర్వహించడం జరుగుతుంది. ఈ సందర్భంగా కరీంనగర్ పౌర సమాజం పక్షాన లీడ్ ఇండియా నేషనల్ క్లబ్ అధ్యక్షులు, అంత ర్జాతీయ లయన్స్ సేవా సంస్థ సీనియర్ సభ్యులు, విశ్రాంత ప్రధానాచార్యులు లయన్ కెప్టెన్ డా : బుర్ర మధుసూదన్ రెడ్డి కరీంనగర్ జిల్లా ఐఏఎస్ అధికారులను ఘనంగా సన్మానించి వారికి నేషనల్ సివిల్ సర్వెంట్స్ డే శుభాకా ంక్షలు తెలియదేశారు. ఈ వేదికగా కరీంనగర్ జిల్లాలో సేవలందిస్తున్న ముగ్గురు ఐఏఎస్ అధికారులు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రతీక్ దేశాయ్, అసిస్టెంట్ ట్రేయినీ కలెక్టర్ అజయ్ యాదవ్‌లను డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి శాలువలతో సన్మానించి పుస్తకాలను అందించారు. ఐఏఎస్, ఐపిఎస్ లాంటి సివిల్ సర్వీసుల్లో అవిశ్రాంతంగా అమూల్యమైన సేవలు అందిస్తున్న సివిల్ సర్వెంట్స్ నవభారత నిర్మాణంలో "స్టీల్ ఫ్రేమ్ ఆఫ్ ఇండియా"గా నిలుస్తూ దేశాభివృద్ధిలో ప్రధాన భూమిక నిర్వహిస్తున్నారని కెప్టెన్ రెడ్డి కొనియాడారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా సివిల్ సర్వెంట్స్ నిలుస్తూ సమ్మిళిత సుస్థిరాభి వృద్ధి దిశగా అత్యుత్తమ సేవలు అందిస్తున్నారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీతలు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రతీక్ దేశాయ్, అసిస్టెంట్ ట్రేయినీ కలెక్టర్ అజయ్ యాదవ్‌లు డా: కెప్టెన్ బుర్ర మధుసూదన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

---

# ఓటర్లకు అవగాహనపై 'సిబిసి' ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శనను ప్రారంభించిన ఎన్నికల సంఘం తెలంగాణ ప్రధానాధికారి వికాస్ రాజ్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21: రాబోయే లోక్‌సభ ఎన్నికలలో ఓటింగ్ శాతం పెంపు దిశగా ఓటర్లకు అవగాహన కల్పనపై సమాచార-ప్రసార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోగల 'సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్' (సిబిసి) ఇవాళ ఒక ఫోటో ప్రదర్శనను ఏర్పాటు చేసింది. 'ఓటర్లకు ప్రణాళికబద్ధ అవగాహన కల్పన-ఎన్నికల ప్రక్రియలో భాగస్వామ్యం' (స్వీప్) కార్యక్రమంలో భాగంగా ఈ ప్రదర్శన ప్రారంభించబడింది. ఇందులో 'సిబిసి' రూపొందించి, నిర్వహించిన 32 సమాచార ప్యానెళ్ల శ్రేణి చిత్రాలు ప్రదర్శించబడతాయి. ఇది 1951 నుంచి ప్రారంభమైన భారత ఎన్నికల చరిత్రను వీక్షకుల కళ్లకు కడుతుంది. అలాగే పోలింగ్ ప్రక్రియలో భాగమైన భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) అనువర్తనాల నుంచి ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల వరకూ అన్ని అంశాలనూ ఈ ప్రదర్శన సమగ్రంగా వివరిస్తుంది.

ఎన్నికల సంఘం తెలంగాణ రాష్ట్ర ప్రధానాధికారి శ్రీ వికాస్ రాజ్, ఐఎఎస్ గారు ఈ ప్రదర్శనను ప్రారంభించారు. ప్రజాసామ్య మహోత్సవం వంటి ప్రస్తుత ఎన్నికల ప్రక్రియను స్వేచ్ఛగా, పారదర్శకంగా నిర్వహించడంలో ఓటర్లు తమవంతు పాత్ర పోషించాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. ఈ మేరకు "పోలింగ్ ప్రక్రియను మనం స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించాల్సిన అవసరం ఎంతయినా ఉంది. అంతేగాక ప్రలోభ రహితంగా నిర్వహణకూ సహకరించే బాధ్యత ఓటర్లదే"నని సూచించారు.

ఈ కర్తవ్యంలో భాగంగా ఓటర్లు మొట్టమొదట తమ పోలింగ్ కేంద్రం ఎక్కడున్నదీ కచ్చితంగా తెలుసుకోవాలని శ్రీ వికాస్ రాజ్ కోరారు. పోలింగ్ కేంద్రం వివరాలు తెలుసుకునేందుకు 'ఇసిఐ' పోర్టల్ సహా మొబైల్ అనువర్తనాల వంటి పలు మార్గాలున్నాయని చెప్పారు. ఓటు హక్కును వినియోగించుకోవడం కోసం ఎన్నికల సంఘం జారీచేసిన గుర్తింపు (ఎపిక్) కార్డు లేదా 'ఇసిఐ' అనుమతించిన 12 రకాల గుర్తింపు కార్డులలో దేనితోనైనా పోలింగ్ కేంద్రానికి వెళ్లవచ్చునని ఆయన చెప్పారు. ప్రస్తుత వేసవిలో రాష్ట్రవ్యాప్తంగా వడగాలుల ప్రభావం ఉన్నప్పటికీ ఎన్నికల సంఘం తగు ఏర్పాట్లు చేస్తున్నదని తెలిపారు. కాబట్టి వేసవి ఉష్ణోగ్రతల కారణంతో ఓటు వేయకుండా ఉండవద్దని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. గడచిన ఏడెనిమిది నెలలుగా 'ఇసిఐ' అవగాహన కల్పన కార్యక్రమాలను నిర్వహిస్తోందని ఇందులో భాగంగా 'స్వీప్' కృషిని మరింత బలోపేతం చేసేందుకు 'ఎంజిబిఎస్' ప్రాంగణం లో 'సిబిసి' ఫోటో ప్రదర్శన ఏర్పాటు చేయడాన్ని శ్రీ వికాస్ రాజ్ అభినందించారు.

ఈ సందర్భంగా 'టిఎస్ఆర్‌టిసి' వైస్ చైర్మన్-మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ వి.సజ్జనార్, ఐపీఎస్ గారు మాట్లాడుతూ- పోలింగ్ నిమిత్తం ఇచ్చే సెలవును సద్వినియోగం చేసుకోవాలని తొలిసారి ఓటర్లతోపాటు యువతకు సూచించారు. ఈ ప్రజాస్వామ్య మహోత్సవంలో చురుగ్గా పాలు పంచుకోవడంతోపాటు ఓటర్లు ఉచితాలకు ప్రభావితం కాకుండా చూడాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా 'టిఎస్ఆర్‌టిసి' ప్రాంగణాల్లో ఇలాంటి ఓటరు అవగాహన కార్యక్రమాల నిర్వహణకు పూర్తిస్థాయిలో సహకరిస్తామని శ్రీ సజ్జనార్ ఈ సందర్భంగా ప్రకటించారు.

ఈ కార్యక్రమంలో హైదరాబాద్‌లోని పత్రికా సమాచార సంస్థ (పిఐబి), 'సిబిసి' విభాగాల అదనపు డైరెక్టర్ జనరల్ శ్రీమతి శ్రుతిపాటిల్ కూడా ప్రసంగించారు. కేంద్ర సమాచార-ప్రసార మంత్రిత్వ శాఖ, తెలంగాణ సీఈవో కార్యాలయం సహకారంతో రాష్ట్రవ్యాప్తంగా వీధి నాటకాల ప్రదర్శన వంటి పలు ప్రచార-అవగాహన కార్యక్రమాల నిర్వహణ గురించి ఆమె గుర్తుచేశారు. ముఖ్యంగా పట్టణ ఓటర్లలో ఓటు హక్కు వినియోగంపైగల ఉదాసీనతను పోగొట్టడం లక్ష్యంగా రాష్ట్రంలోని ప్రధాన పట్టణాల్లో 'సిబిసి' ఇలాంటి ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నదని వెల్లడించారు.

సంయుక్త సీఈవో శ్రీ సర్ఫరాజ్ అహ్మద్; 'టిఎస్ఆర్‌టిసి' ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీ ఎ.పురుషోత్తం నాయక్; రీజినల్ మేనేజర్ (రంగారెడ్డి) శ్రీ డి.రాజు; పిఐబి డైరెక్టర్ శ్రీ బాలకృష్ణ; పిఐబి డిప్యూటీ డైరెక్టర్ శ్రీమతి కరీనా బి.తెంగమం; మరో డిప్యూటీ డైరెక్టర్ శ్రీ మానస్ కృష్ణకాంత్; హైదరాబాద్ 'సిబిసి' అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీ ఐ.హరిబాబు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఫోటో ప్రదర్శన ప్రారంభోత్సవం నేపథ్యంలో 'సిబిసి' సంగీత-నాటక విభాగం కళాకారుల బృందం 'ఓటే మన ఆయుధం' నాటకం ప్రదర్శించింది. తొలిసారి ఓటర్లతోపాటు యువతరం తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఈ నాటకం ప్రబోధించింది.

ఓటర్లకు అవగాహన కల్పన కోసం మహాత్మా గాంధీ బస్ స్టేషన్ ప్రాంగణంలోని సెంట్రల్ రిజర్వేషన్ కౌంటర్ వద్ద ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శన మూడు రోజులపాటు కొనసాగి, 2024 ఏప్రిల్ 22న ముగుస్తుంది. తద్వారా నిత్యం పెద్ద సంఖ్యలో ప్రయాణించే ప్రజానీకానికి ఈ ప్రచార కార్యక్రమం చేరువవుతుంది. ఇందులో భాగంగా 'సిబిసి' రూపొందించిన అవగాహన వీడియోలను కూడా ప్రదర్శిస్తారు.

---

# సివిల్స్ 27వ ర్యాంకర్‌కు సన్మానం



హైదరాబాద్, ఏప్రిల్ 21: (నేటినిజం ప్రతినిధి):ఇటీవల యూపిఎస్‌సి విడుదల చేసిన సివిల్ సర్వీసెస్ పోటీ పరీక్ష ఫలితాల్లో కరీంనగర్‌కు చెందిన సాయి కిరణ్ 27వ ర్యాంకు సాధించడం మనందరికీ గర్వకారణం.

ఈ సందర్భంగా సాయి కిరణ్‌ను హైకోర్టు న్యాయమూర్తి ఈ వి వేణుగోపాల్ చేతుల మీదుగా కెప్టెన్ డా బుర్ర మధుసూదన్ రెడ్డి, వడకాపురం జగదీశ్వరాచారి కరీంనగర్ పట్టణంలో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

---

# కూటమి అభ్యర్థులు విజయం సాధించాలి- చిరంజీవి..

**-చాలా కాలం తర్వాత రాజకీయాలపై పెదవి విప్పిన మెగాస్టార్**
**-చిరంజీవితో సిఎం రమేష్, పంచకర్లలు భేటి**
**-తమ్ముడు పవన్ చొరవతో కూటమి ఏర్పాటు**
**-ఇది మంచి పరిణామం అంటూ ప్రశంస**
**-మంచి అభ్యర్థులను గెలిపించాలని పిలుపు**



అమరావతి, ఏప్రిల్ 21: ఎపిలో జరుగుతున్న ఎన్నికలలో జనసేన, టిడిపి, బిజెపి కూటమి అభ్యర్థులు విజయం సాధించాలని ఆకాంక్షించారు మెగాస్టార్ చిరంజీవి కొన్నేళ్లుగా రాజకీయాలకు దూరంగా ఉంటున్న చిరంజీవి తొలిసారిగా పెదవి విప్పారు.. తన మనసులోని మాటను వెల్లడిం చారు.

జనసేన, టీడీపీ, బీజేపీ ఒక కూటమిగా ఏర్పడడం మంచి పరిణామమని అభిప్రాయపడ్డారు. తన తమ్ముడు పవన్ కల్యాణ్ వల్లే చాలా కాలం తర్వాత రాజకీయాల గురించి మాట్లాడుతున్నానని అన్నారు. అనకాపల్లి లోక్‌సభ ఎంపీ కూటమి అభ్యర్థి సీఎం రమేశ్, పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గ కూటమి అభ్యర్థి పంచకర్ల రమేశ్ హైదరాబాద్‌లోని చిరంజీవి నివాసంలో నేడు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా మెగాస్టార్ మాట్లాడుతూ, సీఎం రమేశ్, పంచకర్ల రమేశ్‌లను గెలిపించాలని ఓటర్లను చిరంజీవి కోరారు. " తమ్ముడు పవన్ కల్యాణ్ కారణంగా చాలా కాలం తర్వాత రాజకీయల గురించి మాట్లాడుతున్నాను. పవన్ కల్యాణ్, చంద్రబాబు, బీజేపీ నాయకత్వం అందరూ మంచి కూటమిగా ఏర్పడ్డారు. ఇది శుభపరిణామం. సంతోషంగా ఉంది. నా చిరకాల మిత్రుడు సీఎం రమేశ్, పంచకర్ల రమేశ్ నాకు కావాల్సిన ఇద్దరూ అనకాపల్లి లోక్‌సభ పరిధిలోనే పోటీ చేస్తున్నారు. ఒకరు ఎంపీ అభ్యర్థిగా, ఇంకొకరు పెందుర్తి అసెంబ్లీ అభ్యర్థిగా బరిలోకి దిగారు. ఇద్దరూ మంచివాళ్లే కాకుండా సమర్థులు. నియోజకవర్గాల అభివృద్ధికి దోహదపడతారు. ఆ విషయంలో నాకు పూర్తి నమ్మకం ఉంది" అని అన్నారు.

"కేంద్రంతో సీఎం రమేశ్‌కి ఉన్న పరిచయాలు అనకాపల్లి లోక్‌సభ స్థానం అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడతాయి. తద్వారా పంచకర్ల రమేశ్‌తో పాటు ఇతర ఎమ్మెల్యేలు కోరుకునే అభివృద్ధి పనులు సజావుగా సాగిపోతాయి. మీ అందరి ఆశీస్సులు వీరిపై ఉంటాయని నమ్ముతున్నాను. దయచేసి వీరిద్దరిని గెలిపించండి. నాదో పెద్ద కోరిక. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిపథంలో ముందుకు వెళ్లాలి. దానికి మీరందరూ నడుం బిగించండి. ఇలాంటివారికి ఓటు వేసి గెలిపించి మీ ఆశీస్సులు అన్ని విధాలుగా వీరికి ఉన్నాయనే నమ్మకాన్ని మాకు కలిగించండి" అని చిరంజీవి అన్నారు.

---

# కఠిన ప్రాంతాల్లో పని చేసే సైనికులు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలను పరిష్కరించే సాంకేతికతలు అభివృద్ధి చేసేందుకు ఏఎఫ్ఎంఎస్ & ఐఐటీ కాన్పూర్ ఒప్పందం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21: సైనిక అవసరాల విషయంలో పరిశోధన ఉ శిక్షణ కోసం 'ఆర్మ్‌డ్ ఫోర్సెస్ మెడికల్ సర్వీసెస్' (ఏఎఫ్ఎంఎస్), 18 ఏప్రిల్ 2024న, 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ' (ఐఐటీ) కాన్పూర్‌తో ఒక అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. ఆర్మ్‌డ్ ఫోర్సెస్ మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్, లెఫ్టినెంట్ జనరల్ దల్జీత్ సింగ్, ఐఐటీ కాన్పూర్ అఫిషియేటింగ్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్.గణేష్ ఈ ఎంవోయూ మీద సంతకాలు చేశారు.

కఠినమైన ప్రాంతాల్లో పని చేసే సైనికులు ఎదుర్కొనే ఆరోగ్య సమస్యలను పరిష్కరించడానికి పరిశోధనలు, కొత్త సాంకేతికతలను అభివృద్ధి చేయడానికి ఈ ఒప్పందంలో భాగంగా ఏఎఫ్ఎంఎస్ ఉ ఐఐటీ కాన్పూర్ పరస్పరం సహకరించుకుంటాయి.

ఆర్మ్‌డ్ ఫోర్సెస్ మెడికల్ కాలేజీలోని 'ఆర్మ్‌డ్ ఫోర్సెస్ సెంటర్ ఫర్ కంప్యూటేషనల్ మెడిసిన్'లో ఏఐ పరీక్షల నమూనాలను అభివృద్ధి చేయడానికి సాంకేతిక నైపుణ్యాన్ని కూడా ఐఐటీ కాన్పూర్ అందిస్తుంది, ఇలాంటి ఒప్పందం భారతదేశంలోని వైద్య కళాశాల్లో మొదటిది. అధ్యాపకుల మార్పిడి కార్యక్రమం, ఉమ్మడి విద్య కార్యకలాపాలు, శిక్షణ మాడ్యూళ్ల అభివృద్ధి కూడా ఈ ఒప్పందంలో ఉన్నాయి.

సైనికులకు అత్యుత్తమ వైద్య సంరక్షణ అందించడానికి ఏఎఫ్ఎంఎస్ అంకితభావంతో పని చేస్తోందని, ఐఐటీ వంటి జాతీయ స్థాయి సంస్థతో కలిసి పని చేయడం ఈ నిబద్ధతలో ఒక ముఖ్యమైన అడుగు అని లెఫ్టినెంట్ జనరల్ దల్జీత్ సింగ్ చెప్పారు.

ఆరోగ్య సంరక్షణలో ఏఐ వంటి అధునిక సాంకేతిక పరిజ్ఞానాల సహకారం, వినియోగం అవసరాన్ని ప్రొఫెసర్ గణేష్ స్పష్టం చేశారు.

# వైస్ ఎడ్ మిరల్ శ్రీ దినేశ్ కుమార్ త్రిపాఠిని నౌకా దళానికి తదుపరి ప్రధాన అధికారి గా నియమించడమైంది

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21: పివిఎస్ఎమ్, ఎవిఎస్ఎమ్ మరియు ఎన్ఎమ్ సమ్మానాల గ్రహీత వైస్ ఎడ్ మిరల్ శ్రీ దినేశ్ కుమార్ త్రిపాఠి ని నౌకా దళాని కి తదుపరి ప్రధాన అధికారి గా ప్రభుత్వం నియమించింది.

ఆయన 2024 ఏప్రిల్ 30 వ తేదీ మధ్యాహ్నం తరువాత తన పదవీబాధ్యతల ను స్వీకరించనున్నారు. ప్రస్తుతం లో ఆయన నౌకాదళాని కి ఉప ప్రధాన అధికారి గా ఉంటున్నారు. నౌకాదళం వర్తమాన ప్రధాన అధికారి ఎడ్ మిరల్ గా ఉన్న పివిఎస్ఎమ్, ఎవిఎస్ఎమ్ మరియు విఎస్ఎమ్ సమ్మానాల గ్రహీత శ్రీ ఆర్. హరి కుమార్ 2024 ఏప్రిల్ 30 వ తేదీ న పదవీ విరమణ చేయనున్నారు.

వైస్ ఎడ్ మిరల్ శ్రీ దినేశ్ కుమార్ త్రిపాఠి 1964 మే నెల 15 వ తేదీ నాడు జన్మించారు. ఆయన ను 1985 జులై నెల 1 వ తేదీ న భారతీయ నౌకాదళం లో ఎగ్జిక్యూటివ్ బ్రాంచ్ లో నియమించడమైంది. ఆయన కమ్యూనికేశన్ మరియు ఎలక్ట్రానిక్ వార్ ఫేర్ లో చేయి తిరిగిన వ్యక్తి. నౌకాదళం లో దాదాపు 39 సంవత్సరాల పాటు ఆయన దీర్ఘమైనటువంటి మరియు విశిష్టమైనటువంటి సేవల ను అందించారు. ఆయన నౌకాదళం ఉ వ ప్రధాన అధికారి గా పదవీబాధ్యతల ను స్వీకరించడాని కంటే ముందు పశ్చిమ నౌకాదళం లో ఫ్లేగ్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్ గా పనిచేశారు.

వైస్ ఎడ్ మిరల్ శ్రీ డి.కె. త్రిపాఠి ఇది వరకు భారతీయ నౌకాదళం లో వినాశ్, కిర్చ్ మరియు త్రిశూల్ నౌకల కు సారథ్య బాధ్యతల ను వహించారు. దీనికి అదనం గా ఆయన వివిధ హోదాల లో బాధ్యతల ను నిర్వర్తించారు. ఆ బాధ్యతల లో వెస్టర్న్ ఫ్లీట్ లో ఫ్లీట్ ఆపరేశన్ ఆఫీసర్; నేవల్ ఆఫరేశన్స్ లో డైరెక్టర్; నెట్ వర్క్ సెంట్రిక్ ఆపరేశన్స్ యొక్క ప్రిన్సిపల్ డైరెక్టర్ మరియు న్యూ ఢిల్లీ లో నేవల్ ప్లాన్స్ యొక్క ప్రిన్సిపల్ డైరెక్టర్ వంటివి ఉన్నాయి.

రియర్ ఎడ్ మిరల్ హోదా లో ఆయన నేవల్ స్టాఫ్ కు అసిస్టెంట్ చీఫ్ (పాలిసీ ఎండ్ ప్లాన్స్) గా మరియు ఈస్టర్న్ ఫ్లీట్ లో ఫ్లేగ్ ఆఫిసర్ కమాండింగ్ గాను పనిచేశారు. ఆయన వైస్ ఎడ్ మిరల్ పదవి లో ఎళిమల లో గల ప్రతిష్టాత్మకమైన ఇండియన్ నేవల్ అకైడెమి కి కమాండెంట్ గాను; నేవల్ ఆపరేశన్స్ విభాగం లో డైరెక్టర్ జనరల్ గాను; పశ్చిమ నౌకాదళం లో సిబ్బంది ప్రధాన అధికారి మరియు ఫ్లేగ్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్ గాను సేవల ను అందించారు.

రీవా లోని సైనిక పాఠశాల లో మరియు ఖడక్ వాస్ లా లోని జాతీయ డిఫెన్స్ అకైడెమి లో పూర్వ విద్యార్థి అయిన వైస్ ఎడ్ మిరల్ శ్రీ దినేశ్ కుమార్ త్రిపాఠి వెలింగ్ టన్ లో ఉన్న డిఫెన్స్ సర్వీసెజ్ స్టాఫ్ కాలేజ్ లోను, కరంజ్ లో ఉన్న నేవల్ హయర్ కమాండ్, ఇంకా యుఎస్ఎ లో యునైటెడ్ స్టేట్స్ నేవల్ వార్ కాలేజ్ లోని నేవల్ కమాండ్ కాలేజీ లో వివిధ పాఠ్యక్రమాల ను పూర్తి చేశారు.

# 2024 వేసవి కాలంలో రికార్డు సంఖ్యలో అదనపు రైళ్ళ ను నడుపుతున్న భారతీయ రైల్ వే లు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21: ప్రయాణికుల కు సౌకర్యవంతం గా ఉండే విధం గాను మరియు వేసవి కాలం లో యాత్రల డిమాండు లో అపేక్షిత వృద్ధి కి తగిన విధం గాను ఏర్పాటుల ను చేయడం కోసమని ఎండ కాలం లో రికార్డు సంఖ్య లో 9111 యాత్రల ను ఇండియన్ రైల్ వేస్ నిర్వహిస్తున్నది.

2023 వ సంవత్సరం ఎండ కాలం తో పోలిస్తే ఇది తగినంత వృద్ధి ని చూపుతోంది. గడచిన గ్రీష్మ కాలం లో మొత్తం మీద 6369 యాత్ర లు నమోదు అయ్యాయి. ఈ సంఖ్య ను చూశామా అంటే గనక పెరుగుదల 2742 యాత్రలు గా ఉన్నట్లు తేలుతుంది. దీని అర్థం ప్రయాణికుల అవసరాల ను ప్రభావవంతం గా తీర్చడం కోసం భారతీయ రైల్ వే లు ఎంత నిబద్ధత తో ఉన్నదీ తెలుసు న్నది.

అదనపు రైళ్ళ ను ప్రముఖమైనటువంటి రైలు మార్గాల లో ఎటువంటి అంతరాయం ఎదురవకుండా యాత్ర సాగిపోయేటట్టు గా పూచీపడడం కోసం దేశవ్యాప్తం గా కీలక గమ్యస్థానాల ను కలపడం కోసం అదనపు రైళ్ల ప్రణాళిక ను ఎంతో శ్రద్ధ ను తీసుకొని రూపొందించడమైంది. అన్ని జోనల్ రైల్ వేల తరఫు న భారతదేశ వ్యాప్తం గా ఎండకాలం లో తమిళ నాడు, మహారాష్ట్ర, గుజరాత్, ఒడిశా, పశ్చిమ బంగాల్, బిహార్, ఉత్తర్ ప్రదేశ్, కర్నాటక, ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ, ఝార్ ఖండ్, మధ్య ప్రదేశ్, రాజస్థాన్ మరియు దిల్లీ వంటి రాష్ట్రాల లో యాత్రికుల రద్దీ ని తగ్గించడం కోసం ఈ అదనపు యాత్ర ల ను నిర్వహించడానికి సన్నాహాలు చేయడమైంది.

# స్వదేశీ సాంకేతికపరిజ్ఞానం తో రూపొందించిన క్రూజ్ క్షిపణిని ఒడిశా కోస్తాతీరానికి అవల విజయవంతంగాపరీక్షించిన డిఆర్ డిఒ



న్యూఢిల్లీ, ఏప్రిల్ 21: దేశీయ సాంకేతిక పరిజ్ఞానం తో రూపొందించిన క్రూజ్ మిసైల్ (ఐటిసిఎమ్) ప్రయోగ పరీక్ష ను రక్షణ రంగ పరిశోధన మరియు అభివృద్ధి సంస్థ (డిఆర్ డిఒ) ఒడిశా తీరప్రాంతాని కి అవల ఉన్న చాందీపుర్ లోని ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ (ఐటిఆర్) నుండి 2024 ఏప్రిల్ 18వ తేదీ నాడు విజయవంతం గా నిర్వహించింది. ఈ పరీక్ష లో భాగం గా, క్షిపణి లోని ఉప వ్యవస్థ లు అన్నీ కూడాను వాటి విధుల ను అంచనా ల మేరకు నెరవేర్చాయి. క్షిపణి పనితీరు ను రేడార్, ఎలక్ట్రో ఆప్టికల్ ట్రేకింగ్ సిస్టమ్ (ఇఒటిఎస్)లతో పాటు ప్రయోగ పథాన్ని పూర్తి గా పర్యవేక్షించడం కోసమని వేరు వేరు ప్రదేశాల లో టెలిమెట్రీ (రిమోట్ సోర్సెస్ నుండి డేటా మాపనం మరియు తంత్రిరహిత పద్ధతి లో ట్రాన్స్ మిశన్) ని ఐటిఆర్ చేత మోహరింప చేయడం, ఇంకా మరికొన్ని రేంజ్ సెన్సర్ ల ద్వారా పర్యవేక్షించడమైంది. ఈ క్షిపణి పయనించిన మార్గాన్ని భారతీయ వాయు సేన కు చెందిన ఎస్ యు-30-ఎమ్ కె-ఐ యుద్ధ విమానం లో నుండి సైతం పర్యవేక్షించడమైంది.

నిర్దిష్ట బిందువుల ను అనుసరిస్తూ పోయి, క్షిపణి తనకు ఆజ్ఞాపించిన మార్గం లో సముద్ర ఉపరితలం మీద చాలా తక్కువ ఎత్తు లో ప్రయాణం చేసింది.

బెంగళూరు కు చెందిన గేస్ టర్బయిన్ రిసర్చ్ ఎస్టాబ్లిశ్ మెంట్ (జిటిఆర్ఇ) అభివృద్ధి పరచిన ఎగదోసే వ్యవస్థ ను క్షిపణి లో అమర్చారు. ఈ వ్యవస్థ కూడాను పరీక్షపూర్వక విన్యాసం లో నమ్మదగిన రీతి లో పనిచేసింది.

మెరుగైనటువంటి మరియు ఆధారపడదగినటువంటి పనితీరు ను ఈ క్షిపణి కనబరచేటట్టుగా ఆధునిక ఎలక్ట్రానిక్ సామగ్రి ని కూడా క్షిపణి కి జతపరచడమైంది. క్షిపణి ని బెంగళూరు కేంద్రం గా కార్యకలాపాల ను నిర్వహిస్తున్నటువంటి డిఆర్ డిఒ లబారటరి లోని ఎయర్ నాటికల్ డివెలప్ మెంట్ ఎస్టాబ్లిశ్ మెంట్ (ఎడిఇ) ఇతర ప్రయోగశాల ల యొక్క మరియు భారతదేశం లోని పరిశ్రమల యొక్క తోడ్పాటు ను తీసుకొని అభివృద్ధి పరచింది. ఈ పరీక్ష ప్రక్రియ ను వివిధ డిఆర్ డిఒ లబారటరి ల సీనియర్ శాస్త్రవేత్తలు, ఇంకా ఉత్పత్తి ప్రక్రియ లో భాగస్వామిగా ఉన్న సంస్థ ప్రతినిధులు వీక్షించారు.

ఐటిసిఎమ్ ప్రయోగ పరీక్ష ను ఫలప్రదం గా నిర్వహించినందుకు గాను డిఆర్ డిఒ కు రక్షణ శాఖ మంత్రి శ్రీ రాజ్ నాథ్ సింహ్ అభినందనల ను తెలియ జేశారు. దేశవాళీ ఎగదోత వ్యవస్థ యొక్క అండదండల తో దూర ప్రాంత సబ్ సానిక్ క్రూజ్ మిసైల్ ను అభివృద్ధి పరచడం భారతదేశం లో రక్షణ రంగ పరిశోధన మరియు అభివృద్ధి (ఆర్ ఎండ్ డి) ల పరం గా చూసినప్పుడు ఒక ప్రధానమైన మైలురాయి వంటి పరిణామం అని మంత్రి స్పష్టం చేశారు.

ఐటిసిఎమ్ సఫల పరీక్ష కార్యక్రమానికి గాను డిఆర్ డిఒ కు చెందిన యావత్తు జట్టు సభ్యుల ను రక్షణ రంగ పరిశోధన మరియు అభివృద్ధి (ఆర్ ఎండ్ డి) విభాగం కార్యదర్శి , డిఆర్ డిఒ చెయర్ మన్ డాక్టర్ శ్రీ సమీర్ వి. కామత్ అభినందించారు.

# సీఎం జగన్‌పై షర్మిల వ్యాంగ్యాస్త్రాలు

## -వైసీపీ టీడీపీ దొందు దొందే
## -కాంగ్రెస్ తోనే రాష్ట్రంకు న్యాయం
## -చంద్రబాబు, జగన్ రాష్ట్ర ప్రజలను నిలువునా వంచించారు.
## -కేంద్రంలోని బిజెపి వద్ద రాష్ట్ర పరువును తాకట్టు పెట్టిన టిడిపి, వైసిపి.
## -కర్నూల్లో పిసిసి అధ్యక్షురాలు వైయస్ షర్మిల



అమరావతి, ఏప్రిల్ 21: కుంభకర్ణుడు ఏడాదిలో ఆరు నెలలు మాత్రమే నిద్రపోతారని, అయితే నాలుగన్నరేళ్లు నిద్రపోయిన జగన్, ఎన్నికల వేళ నిద్ర లేచారంటూ షర్మిల వ్యాంగ్యాస్త్రాలు ప్రదర్శించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఆమె కర్నూల్లో ఏపి న్యాయ యాత్రను చేపట్టారు. ఈ సందర్భంగా కర్నూల్ నగరంలోని స్థానిక చౌక్ బజారులో హాజరైన అశేష జనాన్ని ఉద్దేశించి ప్రసంగించారు.

రాష్ట్రానికి పదేళ్లుగా తీరని అన్యాయం చేసిన కేంద్రంలోని బిజెపితో టిడిపి నేరుగా పొత్తు పెట్టుకుంటే జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం మోడీకి తొత్తుగా వ్యవహరిస్తుందని విమర్శించారు. కావున ఈ పార్టీలతో రాష్ట్రానికి ఒరిగేదేం లేదన్నారు. రాష్ట్రంకు

పదేళ్లు ప్రత్యేక హోదా ఇస్తామని ఇవ్వకుండా కేంద్రంలోని బిజెపి మోసం చేసిందని గుర్తు చేశారు. పోలవరం విషయంలోనూ ఇదే మోసం జరిగిందన్నారు. వీటిని సాధించే విషయంలో వైసిపి, టిడిపిలు బిజెపిని నిలదీయలేక ప్రజలను వంచిస్తున్నాయన్నారు. ప్రజలను మోసం చేసిన పార్టీలతో టిడిపి నేరుగా పొత్తు పెట్టుకుంటే? మోడీకి తొత్తుగా వైసిపి వ్యవహరిస్తుందని ఆమె విమర్శించారు.

రాష్ట్రంలో ఆ రెండు పార్టీల్లో ఏది అధికారంలోకి వచ్చినా పాలించేది మాత్రం బిజెపినే అని పేర్కొన్నారు. ప్రత్యేక హోదాను సాధించి ఉంటే నేడు రాష్ట్రానికి వేల పరిశ్రమలు వచ్చేవన్న విషయమును గుర్తు చేశారు. స్థానికంగా యువతకు ఉపాధి అవకాశాలు లభించేవన్నారు. ఇవి లేకపోవడంతో కర్నూలు జిల్లా నుంచి ఉపాధి కోసం వలసలు వెళ్లే పరిస్థితి నెలకొందని విచారం వ్యక్తం చేశారు. రాయలసీమకు సాగు, తాగునీటిని అందించే హంద్రీనీవా, ఇతర ప్రాజెక్టులు వైఎస్ హయంలోనే 90 శాతం పూర్తయితే.

మిగతా పది శాతం ఈ పదేళ్లలో ఈ రెండు పార్టీలు పూర్తి చేయలేకపోయాయని దుయ్యబట్టారు. ప్రతి ఏటా జాబ్ కేలండర్ విడుదల చేస్తామని ఇచ్చిన హామీ అమలులో భాగంగా ఈ ఐదేళ్లలో ఎన్ని ఉద్యోగాలు భర్తీ చేశారో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సమాధానం చెప్పాలన్నారు. కర్నూలు జిల్లాలో ప్రతి ఏటా బీటెక్లు డిగ్రీలు పూర్తిచేసిన యువతకు ఉపాధి లేక పొరుగు రాష్ట్రాలైన బెంగళూరు, మహారాష్ట్ర, తెలంగాణ తమిళనాడుకు తరలి వెళుతున్న విషయమును ఆమె గుర్తు చేశారు. ఇండియాతోనే ప్రత్యేక హోదా సాధ్యం అని షర్మిల పేర్కొన్నారు. ప్రత్యేక హోదా సాధన ద్వారా రాష్ట్రంకు పరిశ్రమలు తరలివస్తాయని వీటి ద్వారా యువతీ యువకులకు ఉపాధి కలిగించేందుకు వీలుంటుందన్నారు.

ఉద్యోగాల కల్పన పైనే మొదటి సంతకం

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మొదట 2.30లక్షల ఉద్యోగాల పైనే మొదటి సంతకం చేయనున్నట్లు పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పేర్కొన్నారు. ఇండియా కూటమి అధికారంలోకి వస్తే ఏపీకి పదేళ్ల పాటు ప్రత్యేక హోదా ఇస్తామన్నారు. ఇపుడు ఇస్తున్న ప్రతి హామీని నెరవేర్చుతామని వైఎస్ షర్మిల చెప్పారు. జగన్ తన పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీని విస్మరించారన్నారు. పాఠశాల విద్య అభ్యసించే ప్రతి ఒక్కరికీ అమ్మఒడి ఇస్తామని చెప్పిన జగన్ ఆ తరువాత మాట తప్పారన్నారు. ఇంట్లో ఒక్కరికి మాత్రమే ఇపుడు అమ్మఒడి ఇస్తున్నారన్నారు. అది కూడా పూర్తిస్థాయిలో ఇవ్వకుండా కోత విధిస్తున్నారన్నారు. చంద్రబాబు హయాంలో 23వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ నిర్వహిస్తామని జగన్ తన పాదయాత్ర సందర్భంగా నిరుద్యోగులకు హామీ ఇచ్చారన్నారు.

అయితే నాలుగన్నరేళ్లు నిద్రలో ఉన్న జగన్? ఎన్నికల వేళ 6వేల పోస్టులతో దగా డీఎస్సీ నిర్వహించడానికి నోటిఫికేషన్ ఇచ్చారన్నారు. ఎవరైనా ఎన్నికలకు రెండు నెలల మునుపు డీఎస్సీకి నోటిఫికేషన్ ఇస్తారా అని షర్మిల ప్రశ్నించారు. నిరుద్యోగులను దగా చేయడానికే జగన్ ఈ నాటకం ఆడారన్నారు. గతంలో ప్రభుత్వ చౌక దుకాణాల్లో 11రకాల సరుకులు రేషన్ కార్డుదారులకు అందించే వారన్నారు.

నిత్యావసర సరుకుల్లో కోత

జగన్ ముఖ్యమంత్రి అయ్యాక కేవలం బియ్యం, చక్కెర మాత్రమే పంపిణీ చేస్తున్నారన్నారు. ఇలా నిత్యావసర సరుకుల్లో కోత విధించడం వలన పేదలు అనేక ఇబ్బందులు పడుతున్నారని వైఎస్ షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు. జగన్ పాలనలో ఏడు పర్యాయాలు విద్యుత్ ఛార్జీలు, రెండు సార్లు ఆర్టీసీ ఛార్జీలు పెంచారన్నారు. ప్రస్తుతం సామాన్యులు విద్యుత్ ఛార్జీల బ . ా ం ం మోయలేకున్నారన్నారు. నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెంచడంతో సామాన్యుల బతుకు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. జగన్ పేదలకు సంక్షేమ పథకాలు ఒక చేత్తో ఇచ్చి? రెండు చేతుల్తో వారిని దోచుకు తింటున్నారని ఆమె ఆరోపించారు. అంటే రూ. 100 ఇచ్చి..రూ.. 1000 జనం నుంచి లాక్కుంటున్నారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రతి పేద మహిళకు ఏడాది రూ.లక్ష వంతున ఆర్థిక సాయం చేస్తామన్నారు. వృద్ధులు,వితంతువులకు నెలకు రూ.4వేలు వంతున? ప్రత్యేక ప్రతిభావంతులకు రూ.6వేలు వంతున సామాజిక భద్రత ఫించను అందచేస్తామన్నారు. పేదల ఇళ్ల నిర్మాణం కోసం రూ.5లక్షలు ఆర్థికసాయం చేస్తామన్నారు. ఇల్లు లేని ప్రతి పేదకు పక్కా ఇల్లు నిర్మించి ఇస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని అన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్, ఇండియా వేదిక అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఇక ఓటు తల్లి, చెల్లిలాంటిదని? ప్రతి ఓటరు ఆలోచించి మంచి చేసే వారికి ఓటు వేయాలని షర్మిల విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కర్నూల్ పార్లమెంటు అభ్యర్థి రాం పుల్లయ్య యాదవ్, సిపిఐ, సిపిఎం నేతలు పాల్గొని ప్రసంగించారు.

# కోర్టు తాత్కాలిక బెయిల్.. తల్లిని చూసేందుకు వచ్చిన రాధాకిషన్‌రావు

కరీంనగర్,ఏప్రిల్ 21: : దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎ -4గా ఉన్న టాస్క్ ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్ రావును చంచల్ గూడా జైలు నుంచి పోలీసులు ఆదివారం కరీంనగర్ తీసుకువచ్చారు. నగరంలోని సాగర్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న తన తల్లిని చూసేందుకు నాపల్లి కోర్ట్ బెయిల్ మంజూరు చేసింది.

దీంతో అతడిని భారీ బందోబస్తూ మధ్య తీసుకువచ్చారు. ఆయన సోదరి కరీంనగర్‌లో ఉండడంతో తల్లీని ఆమె సంరక్షణలో ఉంచారు. కాగా, రాధాకిషన్ రావు తల్లి పార్కిన్ సన్ వ్యాధితో బాధపడుతున్నారు. ఇక.. ఆమెను చూడ్డానికి నాంపల్లి కోర్ట్ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు అనుమతి ఇచ్చింది. దీంతో ఆయన తన మాతృమూర్తిని పరామర్శించి చికిత్సకు కావాల్సిన ఏర్పాట్లను డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. దానికి కావాల్సిన ఏర్పాట్లు చేయాలని రిక్వెస్ట్ చేశారు.

# టిడిపి అభ్యర్థులకు బి ఫామ్స్ అందజేత

## -144 అసెంబ్లీ, 17 లోక్ సభ అభ్యర్థులకు
## -బి ఫామ్స్ ఇచ్చి ప్రమాణం చేయిచిన చంద్రబాబు
## -అయిదుగురు అభ్యర్థులు మార్పు
## -ఉండి నుంచి రఘురామ
## -మాడుగుల నుంచి బండారులకు ఛాన్స్
## -అనపర్తి పంచాయితీకి తెర
## -బిజెపి అభ్యర్థిగా నల్లమిల్లి పోటీ

అమరావతి, ఏప్రిల్ 21: టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు.. పార్టీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు బీ ఫారాలను అందజేశారు. ఉండవల్లిలోని ఆయన నివాసంలో ముందుగా లోక్ సభ అభ్యర్థులకు బీ ఫారంలను అందించారు. మొత్తం 144 ఎమ్మెల్యే, 17 ఎంపీ అభ్యర్థులకు బీ ఫారం లను అందజేశారు.



అనంతరం రాష్ట్ర పునర్నిర్మాణం కోసం అందరూ కృషి చేయాలని ప్రమాణం చేయించారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై ఆయన దిశానిర్దేశం చేశారు. పార్టీ గెలుపు కోసం నేతలంతా సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేయాలన్నారు.

కాగా.. బీ ఫారంల పంపిణీకి ముందుగానే.. ఐదు స్థానాల్లో అభ్యర్థులను మార్చింది టీడీపీ. ఉండి ఎమ్మెల్యే టికెట్ ను రఘురామకు కేటాయించగా.. పాడేరు టికెట్ ను మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరికి కేటాయించింది అధిష్ఠానం. అలాగే మాడుగుల టికెట్ బండారు సత్యనారాయణ మూర్తికి, ఎంఎస్ రాజుకు మడకశిర టికెట్ ను కేటాయిస్తూ నిర్ణయం తీసుకుంది. వెంకటగిరి నుంచి కురుగుండ్ల రామకృష్ణను బరిలోకి దింపింది.

అనపర్తి బిజెపి అభ్యర్థిగా నల్లమిల్లి

మరోవైపు అనపర్తి టికెట్ పై చిక్కుముడి వీడింది. నల్లమిల్లి రామకృష్ణారెడ్డి బీజేపీలో చేరి ఆ పార్టీనుంచి పోటీ చేసేలా అంగీకారం తెలిపారు. దీంతో అక్కడ కొన్ని నెలలుగా సాగుతున్న కూటమి అసమ్మతి సెగకు తెరపడింది..

# పవన్ కాలి గోటికి కూడా సరిపోవు.. జగన్ పై చంద్రబాబు విమర్శలు

అమరావతి, ఏప్రిల్ 21: నీ తాత జాగీరు అని రాష్ట్రంలో దోపిడీ చేస్తున్నావా నువ్వు దోచుకుంటే ప్రశ్నించకూడదా అంటూ సీఎం జగన్ పై టీడీపీ అధినేత చంద్రబాబు ధ్వజమెత్తారు. ఇవ్వాల తిరుపతి జిల్లా సత్యవేడులో ప్రజాగళం సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ ప్రజలు తిరుగుబాటు చేస్తే పరారవుతారు వీళ్లు ఆ తిరుగుబాటు సత్యవేడు నుంచి ప్రారంభించాలి అని చంద్రబాబు పిలుపునిచ్చారు.

"అసెంబ్లీ సాక్షిగా బూతులు తిడతారు. ఎవడైతే ఎక్కువ బూతులు తిడతాడో వాడికి మంత్రి పదవి! ఇంకా ఎక్కువ బూతులు తిడితే వాడికి ప్రమోషన్! నా మీద దాడి చేయించిన వాడికి ఒక మంత్రి పదవి! నా మిత్రుడు పవన్ కల్యాణ్ పై దాడి చూశారా? పవన్ కల్యాణ్ రాజకీయాల్లోకి వస్తే నీకెందుకంత కడుపుమంట? ఒక నీతి నిజాయతీతో రాష్ట్రం కోసం ముందుకు వచ్చిన వ్యక్తి పవన్ కల్యాణ్. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదని, కూటమి ఏర్పడాలని చెప్పిన మొదటి వ్యక్తి పవన్ కల్యాణ్.అలాంటి వ్యక్తిని నోటికొచ్చినట్టు మాట్లాడతావా రాష్ట్రమంతా దోచేసిన నువ్వా ఆయనపై అవినీతి ఆరోపణలు చేసేది నువ్వు ఆయన కాలి గోటికి కూడా సరిపోవు. ఇవాళ పవన్ ఒక సినిమాలో నటిస్తే డబ్బులు ఇస్తారు సూపర్ స్టార్ ఆయన! రాజకీయాలు లేకపోతే ఈ జగన్ మోహన్ రెడ్డి ఒక్క నయా పైసాకు పనికొస్తాడా ఏదైనా ఒక్క పని చేసే సత్తా ఉందా నీకు?

నువ్వు ఆయన పెళ్లాల గురించి మాట్లాడతావా? అందుకే పవన్?. "ఓకే, నువ్వు కూడా రా నీతో కూడా సంసారం చేస్తా" అని అన్నాడు.

# జగన్ పెద్ద శాడిస్ట్.. అగ్ర హీరోలను అవమానించిన ఘనుడు : పవన్ కల్యాన్

అమరావతి, ఏప్రిల్ 21: రాష్ట్ర పరదాల మహారాణిని కాలేజీ విద్యార్థులు బస్సు యాత్రలో ఏదో అన్నారని కోపం వచ్చింది. విద్యార్థుల తో పెట్టుకుంటే ఏమవుతుందో ఇప్పటికైనా తెలుసుకుంటే మంచిది. ప్రజలు అన్నీ చూస్తున్నారు. ఈ మహారాణిని ఇంటికి పంపడానికి ప్రజలు ఎప్పుడో సిద్ధమై ఉన్నార'ని జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాన్ అన్నారు.

తూర్పు గోదావరి జిల్లా రాజానగరంలో నిర్వహించిన వారాహి విజయభేరి సభకు పవన్ కల్యాన్ హాజరయ్యారు. ఈ సభలో రాజమండ్రి లోక్ సభ స్థానం బీజేపీ అభ్యర్థి పురందేశ్వరి కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ? కాకినాడ ఆదిత్య కాలేజీ విద్యార్థులు పరదాల మహారాణిని ఇబ్బంది పెట్టారంట అంటూ పరోక్ష వ్యాఖ్యలు చేశారు. మన రాష్ట్రాన్ని ఏలే మహారాణి కొంచెం జాగ్రత్తగా ఉండాలి విద్యార్థులు కక్ష పెంచేసుకుంటారు ఆ మహారాణి వెళ్లిపోవాల్సిన సమయం ఆసన్నమైంది కొత్త తరానికి భవిష్యత్ ఇచ్చేందుకు దేశంలోనూ, రాష్ట్రంలోనూ ఎన్డీయే కూటమి అధికారంలోకి వస్తోంది అని పవన్ పేర్కొన్నారు.

కొన్ని నియోజకవర్గాల్లో జనసేన నెంబర్ వన్ స్థానంలో ఉండి కూడా? ఎక్కడ నెగ్గాలో, ఎక్కడ తగ్గాలో తెలుసుకుని, ఆ మేరకు పొత్తు కుదుర్చుకుని సీట్ల సర్దుబాటు చేసుకున్నాం. పొత్తు ఎందుకంటే మరోసారి వైసీపీ ప్రభుత్వాన్ని భరించలేం. వైసీపీ పాలన ఇంకొక్క సారి వస్తే రాష్ట్రం సర్వనాశనం అయి పోతుంది. ఒకప్పుడు హైదరాబాద్ ఓల్డ్ సిటీలో బ్లేడు బ్యాచ్ గురించి విన్నాను. సరైన పాలకుడ్ని ఎన్నుకోక పోవడం వల్ల ఆ హింసాత్మకమైన సంస్కృతి ఇవాళ పచ్చని తూర్పు గోదావరి జిల్లాలోకి కూడా వచ్చేసింది. దీనికి ఒకటే మందు ఎన్డీయే కూటమి అధికారంలోకి రావడం వైసీపీ గూండాల తాట తీయడమే దీనికి మందు.

జగన్ ఈ మధ్య నన్ను ఎక్కువ తిట్టేస్తున్నాడు పాపం! నన్ను తిడుతుంటే నాకు చాలా కోపం వచ్చేస్తుందని జగన్ అనుకుంటున్నాడు. నన్ను ఏమి తిట్టినా నాకు కోపం రాదు. కానీ ప్రజల మీద ఒక్క ఈగ వాలితే నాకు ఆపాదమస్తకం కోపం వస్తుంది. మీరు బూతులు తిట్టినా నాకు కోపం రాదు కానీ, ఒక దళిత డ్రైవర్ ను అకారణంగా, అన్యాయంగా చంపి డోర్ డెలివరీ చేయగానే నాకు వచ్చిన కోపం అంతా ఇంతా కాదు" అంటూ పవన్ ధ్వజమెత్తారు.

కలుగులో ఎలుక లాంటివాడు జగన్.. ఎవరికి పేరు వచ్చినా తట్టుకలేని స్వభావం. చిత్ర పరిశ్రమను సైతం రాజకీయాల్లోకి లాగాలని



చూశారని పవన్ అన్నారు. లక్షలాది మంది అభిమానులు ఉన్న సినిమా హీరోలంటే జగన్‌కు కుళ్లు అని .. అందరు సినీ హీరోల అభిమానులు ఈ విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని పవన్ అన్నారు. సినిమా టికెట్ల ధరల విషయమై సీఎం జగన్‌తో మాట్లాడేందుకు చిరంజీవి, ప్రభాస్, మహేశ్ వెళితే వారిని అగౌరవపర్చారని ఆరోపించారు.

ప్రైవేటు మీటింగ్ జరుగుతుంటే.. శాడిస్టిక్‌గా సీక్రెట్ కెమెరాలు, మైక్‌లు పెట్టారని విమర్శించారు. చిరంజీవి అందరి తరఫున మాట్లాడితే.. ఆ వీడియోలను బయటకు రిలీజ్ చేసి అగౌరవపరిచారని ధ్వజమెత్తారు. అభిమాన హీరోలను సైతం గేటు దగ్గర నుంచి నడిపించారు. కనీసం భోజనం కూడా పెట్టకుండా కించపరిచి ఆనందం పొందిన వ్యక్తి జగన్ "లక్షలాది మంది అభిమానులు గుండెల్లో పెట్టుకునే హీరోలంటే జగన్‌కు కుళ్లు, ముఖ్యంగా ప్రభాస్, మహేశ్‌బాబు, జూనియర్ ఎన్టీఆర్, అల్లు అర్జున్, రామ్‌చరణ్ అభిమానులు ఈ విషయం గుర్తుపెట్టుకోవాలి" అని పవన్ అన్నారు

'ఉదయం లేస్తే మనందరికీ నీతులు చెప్పే సీఎం జగన్ గత ఐదేళ్లుగా బెయిల్ మీద ఉన్నాడు. 38 కేసులు ఎదుర్కొని 16 నెలలు చిప్పకూడు తిన్న వ్యక్తి. ప్రతి శుక్రవారం వాయిదా ఎలా ఎగ్గొట్టాలి అని వణుకుతూ ఉంటాడు. రాబోయే ఎన్డీఏ ప్రభుత్వంలో జగన్ అవినీతి విషయంలో మళ్లీ జైలుకెళ్లడం ఖాయం. జగన్ ఎక్కడ కోరుకుంటే అక్కడ.. ప్రధాని నరేంద్ర మోదీతో చెప్పి ప్రత్యేక జైలు ఏర్పాటు చేస్తాం. అవినీతి పరులను వదలమని రాజస్థాన్ రాష్ట్రంలో నిర్వహించిన సభ సాక్షిగా చెప్పిన మోదీ గ్యారెంటీతో జగన్ జైలుకు వెళ్లడం ఖాయం' అన్నారు పవన్ కళ్యాణ్.

# పడవ బోల్తా.. 50 మంది మృతి



న్యూఢిల్లీ, ఏప్రిల్ 21: ఆఫ్రికా దేశం సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్‌లో ఘోర విషాదం చోటు చేసుకుంది. పడవ బోల్తా పడి ఏకంగా 50 మంది చనిపోయారు. దేశ రాజధాని బాంగూయ్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. ప్రజలు ఓ గ్రామంలో అంత్యక్రియలకు వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. ఈ ఘటన తర్వాత సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్ మెరుగైన నదీ రవాణా భద్రత కోసం చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చింది.సంఘటన జరిగిన 40 నిమిషాల్లోనే తాము అప్రమత్తమయ్యామని అధికారులు చెప్పారు. రెస్క్యూ సిబ్బంది 50 మృతదేహాలను వెలికి తీసినట్లు సివిల్ ప్రొటక్షన్ డిపార్ట్మెంట్ చీఫ్ థామస్ జిమాస్సే తెలిపారు. మ్బోకో నదిలో ఇంకా సెర్చ్ ఆపరేషన్ జరుగుతున్నట్లు వెల్లడించారు. నదిలో గల్లంతైన మరికొందరి కోసం గాలింపు జరుగుతున్నట్లు తెలిపారు.

ప్రమాద సమయంలో బోటులో 300 మంది వరకు ఉన్నట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ఓ గ్రామ పెద్ద చనిపోవడంతో బాంగూయ్‌కి 45 కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రాంతానికి అంత్యక్రియల కోసం వెళుతుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. మరణాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ప్రమాదం తర్వాత రెస్క్యూ సిబ్బంది రావడానికి 40 నిమిషాలు పట్టింది. అప్పటికే అక్కడ ఉన్న లోకల్ బోట్లు, చేపలు పట్టేవారు ప్రజల్ని రక్షించేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు.

# జైన్ సమాజ్‌కు అన్ని వేళలా అందుబాటులో ఉంటా: మాజీ మంత్రి తలసాని



హైదరాబాద్, ఏప్రిల్ 21: పంచ సూత్రాలను పాటించడం ద్వారానే మానవులు మోక్షాన్ని పొంద గలుగుతారని సూచించిన మహనీయుడు మహావీర్ అని మాజీ మంత్రి, సనత్ నగర్ ఓఎం తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆదివారం మహావీర్ జయంతి సందర్భంగా నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జైన్ సేవా సంఘ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహావీర్ జయంతి ఉత్సవాలకు ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహావీర్ సూచనలు, బోధనలు అనుసరించదగినవని పేర్కొన్నారు. జైన్ సేవా సంఘ్ మహావీర్ బోధనలను అనుసరించి అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుందని గుర్తు చేశారు. కరోనా సమయంలో కూడా పలు సేవా కార్యక్రమాలు చేపట్టి అనేక మందికి అండగా నిలిచిందని తెలిపారు. జైన్ సేవా సంఘ్‌కు ఒక అద్భుతమైన భవనం ఉండాలనే ఆలోచనతో తెలంగాణ ప్రభుత్వం ఉప్పల్ భగాయత్‌లో స్థలం కేటాయించిన విషయాన్ని గుర్తుచేశారు.

జైన్ సమాజ్‌కు తాను అన్ని వేళలా అందుబాటులో ఉంటానని, వారు చేసే కార్యక్రమాలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. అనంతరం నిర్వాహకులు ఓఎం తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమలో జైన్ సేవా సంఘ్ అధ్యక్షులు యోగేష్ సింఘి, మైనారిటీ కమిషన్ సభ్యులు హిమాన్షు బాఫ్నా, అశోక్ జైన్, సురేష్ సురానా, కైలాష్ బండారీ, సుభాష్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

# రైల్వే ప్రొటెక్షన్ ఫోర్సుల్లో 4,660 ఖాళీలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21: నిరుద్యోగులకు శుభవార్త. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని రైల్వే రీజియన్లలో భారీగా కొలువుల భర్తీకి రైల్వేశాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్సు (ఆర్‌పీఎఫ్), రైల్వే ప్రొటెక్షన్ స్పెషల్ ఫోర్స్ (ఆర్‌పీఎస్‌ఎఫ్)లలో మొత్తం 4,660 ఎస్సై, కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతూ రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు నోటిఫికేషన్ విడుదల చేసింది. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు కానిస్టేబుల్ పోస్టులకు పదో తరగతి, ఎస్సై ఉద్యోగాలకు డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి. దరఖాస్తు ప్రక్రియ ఏప్రిల్ 15వ తేదీ నుంచి ప్రారంభం కానుండగా.. మే 14 వరకు అప్లయ్ చేసుకోవచ్చు. రాత పరీక్ష, ఫిజికల్ ఎఫీషియెన్సీ టెస్ట్ తదితరాల ఆధారంగా అభ్యర్థుల ఎంపిక ఉంటుంది.

మొత్తం పోస్టులు : 4,660

పోస్టులు : ఎస్సై, కానిస్టేబుల్

ఆర్‌ఆర్‌బీ రీజియన్లు : అహ్మదాబాద్, అజ్‌మేర్, బెంగళూరు, భోపాల్, కోల్‌కతా, మాల్డా, ముంబయి, ముజఫర్‌పూర్, భువనేశ్వర్, బిలాస్‌పూర్, చండీఘడ్, చెన్నై, గువాహటి, జమ్ము అండ్ శ్రీనగర్, పట్నా, ప్రయాగ్‌రాజ్, రాంచీ, సికింద్రాబాద్, సిలిగురి, తిరువనంతపురం, గోరఖ్‌పూర్.

అర్హతలు : దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు కానిస్టేబుల్ పోస్టులకు పదో తరగతి, ఎస్సై ఉద్యోగాలకు డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.

ఎంపిక : రాత పరీక్ష, సీబీటీ, ఫిజికల్ ఎఫీషియెన్సీ టెస్ట్, ఫిజికల్ మెజర్‌మెంట్ టెస్ట్, మెడికల్ స్టాండర్డ్ టెస్ట్, సర్టిఫికేట్ వెరిఫికేషన్ తదితరాల ఆధారంగా ఎంపిక ఉంటుంది.

# హామీలను మరిచి తిట్ల పురాణం.. సీఎం రేవంత్‌పై కేపీ వివేకానంద ఆగ్రహం




హైదరాబాద్, ఏప్రిల్ 21: బహిరంగ సభల్లో సీఎం రేవంత్ అభ్యంతరకర భాష వాడుతున్నారని.. సీఎం అని, ఇచ్చిన హామీలను మరిచి తిట్ల పురాణం అందుకున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద విమర్శించారు. తెలంగాణ భవన్‌లో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు నెలలకే రేవంత్ ప్రజల విశ్వాసం కోల్పోయారన్నారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ ఉనికి కోల్పోయిందన్నారు. ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేశారని.. ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ నేతలు ప్రజలకు అఫిడవిట్లు ఇచ్చారన్నారు. రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని.. పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ స్థానాలు గెలవకపోతే సీఎం కుర్చీ పోతుందని రేవంత్ రెడ్డి భయపడుతున్నారని విమర్శించారు.

ఆగస్టు నెలలో రైతు రుణమాఫీ చేస్తామని మహబూబాబాద్, మెదక్ సభల్లో రేవంత్ రెడ్డి దేవుడిపై ప్రమాణం చేశారని.. దేవుడిపై ప్రమాణం చేసి ఓట్లు అడగడం అంటే ఎన్నికల కోడ్ ఉల్లంఘన కిందకే వస్తుందన్నారు. 420హామీలు నెరవేర్చడానికి రేవంత్ రెడ్డి ఎంతమంది దేవుళ్లపై ప్రమాణం చేస్తారని ప్రశ్నించారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి, భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని తొక్కి రేవంత్ సీఎం అయ్యారన్నారు. రేవంత్ నాయకత్వాన్ని వీహెచ్, సర్వే సత్యనారాయణ, మోత్కుపల్లి నర్సింహులు

వ్యతిరేకిస్తున్నారన్నారు. రేవంత్ కరెంటు తీగ అయితే ఫ్యూజులు ఎగిరిపోతాయన్నారు. ప్రజలు సంతోషంగా ఉంటే జనజాతర.. రేవంత్ చేసేది ఓట్ల జాతర అని విమర్శించారు.

రాష్ట్రంలో ప్రజలు సాగు, తాగునీరు, కరెంటు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పవర్ మినిస్టర్ భట్టి సీపీఐ ఆఫీస్‌కు వెళ్తే అక్కడ అరగంటపాటు కరెంటు పోయిందన్నారు. విద్యుత్ శాఖ మంత్రికే ఈ పరిస్థితి ఎదురైతే.. సామాన్యుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. రేవంత్ బీజేపీలో చేరుతారని ఎంపీ ధర్మపురి అరవింద్ అంటున్నారని.. పార్టీ కార్యకర్తలను కాపాడుకునే ప్రయత్నం రేవంత్ చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యేలను రక్షించుకునేందుకు రేవంత్ తాపత్రయ పడుతున్నారని.. గాంధీ భవన్‌కు తాళం వేసి ఇంటి నుంచే అన్ని వ్యవహారాలు నడుపుతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీని రేవంత్ రెడ్డి హోల్‌సేల్‌గా అమ్మేస్తారని ఆరోపించారు. ప్రజా సమస్యల పేరుతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పిలిపించుకుని కాంగ్రెస్ కండువా కప్పే ప్రయత్నం చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన దానం నాగేందర్, కడియం శ్రీహరి, గడ్డం రంజిత్ రెడ్డిపై కాంగ్రెస్ పార్టీ క్యాడర్ తిరుగుబాటు చేస్తోందన్నారు.

హైదరాబాద్ నగరంలో రియల్ ఎస్టేట్ కుదేలైందని.. బిల్డర్లకు పర్మిషన్లు ఎందుకు ఆపుతున్నారని ప్రశ్నించారు. సెక్రటేరియట్, ప్రభుత్వ కార్యాలయాలు, ముఖ్యమంత్రి నివాసం పైరవీలకు అడ్డాగా మారిందన్నారు. బీబీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎలాంటి పైరవీలు లేవని.. కాంగ్రెస్ ఎమ్మెల్యేలను రేవంత్ రెడ్డి నియంత్రించలేకపోతున్నారన్నారు. ముదిరాజ్ ఎమ్మెల్యే మీ పార్టీలో ఉన్నారని.. ఇప్పటి వరకు ఎందుకు మంత్రి పదవి ఇవ్వలేదని ప్రశ్నించారు. ఎన్నికల్లో ఓట్లు వేస్తేనే ఆ సామాజిక వర్గానికి మంత్రి పదవి ఇస్తారా? అని నిలదీశారు. కేసీఆర్ బస్సు యాత్రతో మంచి ఫలితాలు వస్తాయన్నారు. హైదరాబాద్ నగరంలో కేటీఆర్ రోడ్ షోలు ఉంటాయని తెలిపారు.

# కాంగ్రెస్‌కు మూడోస్థానం తప్పదు : ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్



మహబూబాబాద్, ఏప్రిల్ 21: (నేటినిజం ప్రతినిధి): పార్లమెంట్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్‌కు మూడోస్థానం తప్పదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలం చెందడంతో మహబూబాబాద్‌లో నిర్వహించిన ఆయన సభలకు జనాలు రాలేదని పేర్కొన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ కు ఓటమి తప్పదని పేర్కొన్నారు. రాష్ట్రంలో అత్యధిక ఎంపీ స్థానాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు విజయం సాధించనున్నారని ధీమాను వ్యక్తం చేశారు.

నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ జిల్లా అభివృద్ధికి అనేక నిధులు ఇచ్చారని వెల్లడించారు. బీఆర్ఎస్ హయాంలో మొదలుపెట్టిన ఇంజినీరింగ్ కాలేజితో పాటు ఇతర అభివృద్ధి పనులకు నిధులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే మురళీనాయక్, ప్రభుత్వ విప్ రామచంద్రు నాయక్ జిల్లాకు నిధులు తీసుకురావడంలో విఫలమయ్యారని ఆరోపించారు.

23న మాలోత్ కవిత నామినేషన్

ఈనెల 23న మహబూబాబాద్ ఎంపీ స్థానానికి బీఆర్ఎస్ అభ్యర్థిగా మాలోత్ కవిత నామినేషన్ వేయనున్నారని ఎమ్మెల్సీ వెల్లడించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎమ్మెల్సీ తక్కలపల్లి రవీందర్ రావు, మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్, జడ్పీ చైర్మన్ అంగోత్ బిందూ, మహబూబాబాద్ మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్ రెడ్డి, వైస్ చైర్మన్ మార్నెని వెంకన్న పాల్గొన్నారు.

# ఆధునిక వ్యవసాయ పద్ధతులపై చర్చ జరుగాలి : స్పీకర్ పోచారం

నిజామాబాద్, ఏప్రిల్ 21: వ్యవసాయ రంగంలో వస్తున్న ఆధునిక పద్ధతులు, అధిక లాభాలను అందించే పంటలపై చర్చ జరగాలని శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. కోటగిరి మండలం పోతంగల్ గ్రామంలో రూ.14 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు.

ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ..వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్ ఫామ్ సాగు చేస్తే రైతులకు మంచి లాభాలు వస్తాయన్నారు. దేశంలో అతిపెద్ద కుటుంబం రైతు కుటుంబం. 70 శాతం కుటుంబాలు రైతులవే. రైతులకు ఉపయోగపడటానికి రాష్ట్ర వ్యాప్తంగా 2,600 రైతు వేదికలను నిర్మించామన్నారు. రైతు వేదికలను అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.


# స్ట్రాంగ్ రూములకు ఈవీఎం యంత్రాలను తరలింపు: రిటర్నింగ్ అధికారి,జిల్లా కలెక్టర్



ఖమ్మం, ఏప్రిల్ 21: (నేటినిజం ప్రతినిధి): అసెంబ్లీ సెగ్మెంట్లలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములకు ఈవీఎం యంత్రాలను తరలిస్తున్నట్లు ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ తెలిపారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి మాట్లాడుతూ... ఇవిఎం ల మొదటి ర్యానీడమైజేషన్ పిదప నూతన కలెక్టరేట్ ఆవరణలోని ఇవిఎం గోదాం ఈవీఎంలు సంబంధిత అసెంబ్లీ సెగ్మెంట్లలో ఏర్పాటుచేసిన ఇవిఎం స్ట్రాంగ్ రూంలకు తరలింపు ప్రక్రియను ఆదివారం చేపట్టినట్లు తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోదాం తెరచి, ఆయా అసెంబ్లీ సెగ్మెంట్ ల సహాయ రిటర్నింగ్ అధికారులకు, వారి వారి అసెంబ్లీ సెగ్మెంట్లకు కేటాయించిన ఇవిఎంలను స్ట్రాంగ్ రూంలకు టీఎస్ ఆర్టీసీ కార్గో సర్వీసుల్లో పటిష్ట భద్రతతో తరలించినట్లు ఆయన అన్నారు. ఖమ్మం, పాలేరు అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించి ఖమ్మం రూరల్ మండలం, పొన్నెకల్ లోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో, వైరా అసెంబ్లీ సెగ్మెంట్ కు సంబంధించి వైరాలోని బాలికల సోషల్ వెల్ ఫెర్ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలలో, మధిర సెగ్మెంట్ కు సంబంధించి మధిరలోని పాలిటెక్నిక్ కళాశాలలో, సత్తుపల్లి సెగ్మెంట్ కు సంబంధించి, సత్తుపల్లి లోని జ్యోతి నిలయం హైస్కూల్ లో స్ట్రాంగ్ రూంలు ఏర్పాటుచేసినట్లు ఆయన తెలిపారు. ఖమ్మం జిల్లా పరిధిలో ఉన్న 5 అసెంబ్లీ సెగ్మెంట్ల స్ట్రాంగ్ రూమ్ లకు మొదటి ఇవిఎం ర్యాండమైజేషన్ లో కేటాయించిన విధంగా ఖమ్మం అసెంబ్లీ సెగ్మెంట్ కు 440 బ్యాలెట్ యూనిట్లు, 440 కంట్రోల్ యూనిట్లు, 497 వివిప్యాట్లు, పాలేరు అసెంబ్లీ సెగ్మెంట్ కు 359 బ్యాలెట్ యూనిట్లు, 359 కంట్రోల్ యూనిట్లు, 406 వివిప్యాట్లు, వైరా అసెంబ్లీ సెగ్మెంట్ కు 312 బ్యాలెట్ యూనిట్లు, 312 కంట్రోల్ యూనిట్లు, 352 వివిప్యాట్లు, మధిర అసెంబ్లీ సెగ్మెంట్ కు 332 బ్యాలెట్ యూనిట్లు, 332 కంట్రోల్ యూనిట్లు, 375 వివిప్యాట్లు, సత్తుపల్లి అసెంబ్లీ సెగ్మెంట్ కు 364 బ్యాలెట్ యూనిట్లు, 364 కంట్రోల్ యూనిట్లు, 411 వివిప్యాట్లు తరలించి, భద్రపర్చడం జరుగుతుందని రిటర్నింగ్ అధికారి తెలిపారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, డి.మధుసూదన్ నాయక్, ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్ సురభి, శిక్షణ సహాయ కలెక్టర్లు మయాంక్ సింగ్, యువరాజ్, మిర్నల్ శ్రేష్ఠ, డిఆర్వో ఎం.రాజేశ్వరి, ఆర్డీవోలు గణేష్, రాజేందర్, తహశీల్దార్లు, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి స్వర్ణ సుబ్బారావు, బీజేపీ పార్టీ ప్రతినిధి వి.రాజేష్, సిపిఐ (ఎం) పార్టీ ప్రతినిధి జి.పున్నయ్య, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి ఎన్. సత్యంబాబు, బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధి చీకటి రాంబాబు, టిడిపి పార్టీ ప్రతినిధి పాలడుగు కృష్ణ ప్రసాద్, అధికారులు తదితరులున్నారు.

# ఎన్నికల ప్రక్రియ వేగవంతం చేయాలి: రిటర్నింగ్ అధికారి,జిల్లా కలెక్టర్ వి.పి.గౌతమ్



ఖమ్మం, ఏప్రిల్ 21: (నేటినిజం ప్రతినిధి): ఎన్నికల ప్రక్రియ వేగవంతం చేయాలని ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ వి.పి.గౌతమ్ తెలిపారు. ఆదివారం నూతన కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో సహాయ రిటర్నింగ్ అధికారులతో లోకసభ సాధారణ ఎన్నికలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ... ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఎన్నికల పనులు నిర్ణీత వ్యవధిలోగా పూర్తి చేయాలన్నారు. మొదటి ర్యానీడమైజేషన్ తదుపరి ఇవిఎం యంత్రాలు సంబంధిత అసెంబ్లీ సెగ్మెంట్ల స్ట్రాంగ్ రూంలకు తరలించినట్లు ఆయన అన్నారు. మే, 3, 4 తేదీల్లో ఇవిఎం ల రెండో ర్యానీడమైజేషన్, కమిషనింగ్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఇందుకై కమిషనింగ్ కొరకు స్ట్రాంగ్ రూంకు దగ్గర్లో అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. కమిషనింగ్ ప్రక్రియలో ఎలాంటి తప్పిదాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ ప్రక్రియపై అభ్యర్థులకు సమాచారం ఇచ్చి, వారి సమక్షంలో చేపట్టాలన్నారు. ఇవిఎంల రవాణాలో హమాలీలకు అసెంబ్లీ సెగ్మెంట్ తెలిసే విధంగా టీ షర్టులపై స్టిక్కర్లు వేయించాలన్నారు. ఓటరు స్లిప్పుల పంపిణీని ఈ నెల 25 నుండి చేపట్టాలన్నారు. ఇంటింటికి పంపిణీ చేయాలని, బల్క్ పంపిణీ చేయరాదని ఆయన తెలిపారు. ఓటర్ స్లిప్పుల పంపిణీలో సెక్టార్ అధికారులు పూర్తిగా భాగస్వామ్యం అయి, పంపిణీ పర్యవేక్షణ చేయాలన్నారు. ఓటర్ స్లిప్పులతో పాటు ఓటర్ హెల్ప్ లైన్, సి-విజిల్, ఓటు ఎలా వేయాలో అవగాహన కల్పించాలని, సి-విజిల్ డౌన్లోడ్ చేయించాలని ఆయన అన్నారు. పోలింగ్ తేదీ, సమయం తెలియజేస్తూ, పోలింగ్ స్టేషన్ లకు వచ్చేలా ఓటర్లకు ఆహ్వానం పలకాలన్నారు. సెక్టార్ అధికారులకు వాహనాల ఏర్పాటు చేసినట్లు, అట్టి వాహనాలు సహాయ రిటర్నింగ్ అధికారులు ప్రారంభించి, సెక్టార్ అధికారులకు అప్పగించాలన్నారు. బూత్ లెవల్ అధికారులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయాలన్నారు. రెండు రోజుల్లో జిల్లాకు ఎపిక్ కార్డులు వస్తాయని, మరో రెండు రోజుల్లో ఎపిక్ కార్డుల బట్వాడా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. మే, 3 నుండి హోం ఓటింగ్ ప్రక్రియ ప్రారంభించాలన్నారు. ఇందుకై సరిపోను టీముల ఏర్పాటు చేయాలన్నారు. హోం ఓటింగ్ టీములకు శిక్షణ ఇవ్వాలన్నారు. పోస్టల్ ఓటింగ్ ప్రక్రియ మే, 3న ప్రారంభం అవుతున్నందున, దీనికి ముందు పోస్టల్ బ్యాలెట్ స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు పూర్తి చేయాలన్నారు. రోజువారి హోం ఓటింగ్, పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ భద్రపర్చుటకు, పోస్టల్ బ్యాలెట్ స్ట్రాంగ్ రూం ను తెరవడం, మూయడం చేసు సందర్భంలో అభ్యర్థులకు నోటీసులు ఇచ్చి వారి సమక్షంలో తెరవడం, మూయడం చేయాలన్నారు. విఎస్టి టీములని క్రియాశీలం చేయాలన్నారు. అనుభవజ్ఞులైన వీడియోగ్రాఫర్ లను విఎస్టి టీములలో వినియోగించాలన్నారు. మేజర్ సభలు, కార్యక్రమాల్లో సహాయ వ్యయ పరిశీలకులు హాజరయ్యేలా చూడాలన్నారు. పోలింగ్ కేంద్రాలను సందర్శించి, కనీస మౌలిక సదుపాయాలకల్పన పై ప్రత్యేక దృష్టి పెట్టాలని, పాఠశాలల్లో మంజూరు పనులు ఈ నెల 23 లోగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. మే నెల 1,2, 6,7 తేదీల్లో పోలింగ్ శిక్షణా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. క్రియాశీలకంగా వుంటూ, షెడ్యూల్ ప్రకారం పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని రిటర్నింగ్ అధికారి తెలిపారు. ఈ సమీక్షలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, నగరపాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్ సురభి, శిక్షణ సహాయ కలెక్టర్లు మయాంక్ సింగ్, యువరాజ్, మిర్నల్ శ్రేష్ఠ, జిల్లా రెవిన్యూ అధికారిణి ఎం.రాజేశ్వరి, ఆర్డీవోలు గణేష్, రాజేందర్, డిఆర్డీఓ సన్యాసయ్య, కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ రాంబాబు, అధికారులు తదితరులున్నారు.

# 15 అంతస్తుల ఆటోమేటెడ్ మల్టీ లెవల్ పార్కింగ్ కాంప్లెక్స్..

హైదరాబాద్, ఏప్రిల్ 21: హైదరాబాద్ నగరవాసులను ట్రాఫిక్ సమస్యతో పాటు పార్కింగ్ సమస్య కూడా ఇబ్బంది పెడుతోంది. ఈ పార్కింగ్ సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం తలపెట్టిన.. పూర్తి ఆటోమేటెడ్, కంప్యూటరైజ్డ్ మల్టీ లెవల్ కార్ పార్కింగ్ (ఓఒఖ) కాంప్లెక్స్ పనులు దాదాపుగా పూర్తయ్యాయి. అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో? దేశంలోనే తొలిసారిగా జర్మన్ పాలిస్ పార్కింగ్ విధానంలో, తక్కువ స్థలంలో ఎక్కువ వాహనాలు పార్కింగ్ చేసేలా ఈ ప్రాజెక్టును చేపట్టారు.

ఈ మేరకు ఆదివారం రోజున ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ఊఓఖీఓ ఎండీ, ఎంఎల్‌పీ పనులను ఎన్వీఎస్ రెడ్డి పరిశీలించారు. ఈ ప్రాజెక్టును పీపీపీ విధానంలో రూ.80 కోట్లతో నిర్మించామని తెలిపారు. నాంపల్లి మెట్రో రైల్ స్టేషన్‌కు సమీపంలో హెచ్‌యంఆర్‌కు చెందిన అర ఎకరం స్థలంలో 15 అంతస్తులుగా ఈ కాంప్లెక్స్ నిర్మాణం జరిగింది.

లక్షా నలభై నాలుగు వందల చదరపు అడుగుల మొత్తం నిర్మాణ విస్తీర్ణంలో 68 శాతం పార్కింగ్‌కు, మిగిలిన 32 శాతం వాణిజ్య సౌకర్యాలకు కేటాయించినట్లు వివరించారు.

# వచ్చీరాని వైద్యం చేసి.. ఓ నిండు ప్రాణం తీసి..!

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21: వచ్చీరాని వైద్యం ఓ నిండు ప్రాణాన్ని బలి తీసుకుంది. ఓ క్లినిక్‌లో కాంపౌండర్‌గా పనిచేస్తున్న వ్యక్తి డాక్టర్ అందుబాటులో లేకపోయినా ఒక మహిళకు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స చేశాడు. ఆపరేషన్ వికటించడంతో సదరు మహిళ ప్రాణాలు కోల్పోయింది.

బీహార్ రాష్ట్రం సమస్తిపూర్ జిల్లాలోని ముస్రిఘరారీ పట్టణంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వివరాల్లోకి వెళ్తే.. ముస్రిఘరారీ పట్టణానికి చెందిన బబితా దేవి అనే 28 ఏళ్ల మహిళ.. కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స కోసం స్థానికంగా ఉన్న అనిషా హెల్త్‌కేర్ క్లినిక్‌కు వచ్చింది. దాంతో వైద్యుడు అందుబాటులో లేడని చెప్పి కాంపౌండర్ ఆపరేషన్ చేశాడు. కానీ ఆ ఆపరేషన్ వికటించి మహిళ మృతిచెందింది.

దాంతో క్లినిక్ సిబ్బంది అంబులెన్స్‌ను పిలిపించి మోహన్‌పూర్‌లోని మరో ఆస్పత్రికి తరలించారు. ఏమైందని బబితాదేవి కుటుంబసభ్యులు అడిగితే.. పరిస్థితి విషమంగా ఉందని చెప్పారు. మోహన్‌పూర్ ఆస్పత్రి వైద్యులు పరిశీలించి బబితాదేవి మరణించినట్లు ధృవీకరించారు.

దాంతో బబితాదేవి బంధువులు ఆమె మృతదేహాన్ని అనిషా క్లినిక్‌కు తీసుకొచ్చి ఆందోళనకు దిగారు. మోహన్‌పూర్‌కు తరలించే ముందు తాము పట్టుకుని చూస్తే బబిత దేహం చల్లగా ఉందని, ఆమె అప్పటికే చనిపోయిందని బంధువులు చెప్పారు. చేసిన తప్పును కప్పిపుచ్చుకోవడానికి క్లినిక్ సిబ్బంది నాటకమాడారని అన్నారు.

కాగా, బబిత బంధువులు ఆందోళనకు దిగుతుండగానే అనిషా క్లినిక్ సిబ్బంది పరారయ్యారు. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ముస్రిఘరారీ ఏరియాలో చాలా క్లినిక్‌లు వైద్యులు లేకుండానే నడుస్తున్నాయని, అర్హతలు లేని వాళ్లే శస్త్రచికిత్సలు చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

# వివాహా వేడుకలో పాల్గొన్న వైరా ఆత్మ కమిటీ చైర్మన్



ఖమ్మం, ఏప్రిల్ 21: (నేటినిజం ప్రతినిధి): కొనిజర్ల మండలంలోని బస్వాపురం గ్రామంలో వెలిశాల నాగేశ్వరరావు-కృష్ణమ్మ దంపతుల కుమారుడు తిరుపతిరావు-అఖిల నూతన దంపతుల వివాహ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని వధూ వరులను ఆశీర్వదించిన వైరా నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్ కోసూరి శ్రీనివాసరావు, నాయకులు యలమందల మధు, పొట్లపల్లి శేషగిరిరావు, వింజనీ వెంకటేశ్వర్లు, నల్లమోతు లక్ష్మయ్య, సముద్రాల యల్లరావు, బొగిన్ని రాంబాబు, తాటిపల్లి శ్రీను, తుళ్ళూరి వెంకటేశ్వర్లు, కర్నాటి లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో దయాకర్ రెడ్డి పర్యటన

## - మమత రోడ్డులో ఆరా డ్యాన్స్ స్కూల్ ప్రారంభం

## - పలు వివాహ వేడుకలకు హాజరు

ఖమ్మం, ఏప్రిల్ 21: (నేటినిజం ప్రతినిధి): తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి జిల్లాలో ఆదివారం పర్యటించారు. నగరంలోని మమత ఆస్పత్రి రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ఆరా డ్యాన్స్ స్కూల్ ను ప్రారంభించారు.

మంచి నృత్య ప్రదర్శనల శిక్షణతో నిర్వాహకులు చక్కటి ఆదరణ పొందాలని దయాకర్ రెడ్డి ఆకాంక్షించారు.

అనంతరం 59వ డివిజన్ దానవాయిగూడెం లో మద్దెల నారాయణ కుమారుడు, ఖమ్మం రూరల్ మండలం సాయిప్రభాత్ నగర్ లోని చల్లపల్లి గార్డెన్స్ లో తుమ్మ నాగచంద్రారెడ్డి కుమారుడు, మద్దులపల్లిలో తూమాటి నారాయణ కుమారుడు, ఖమ్మం నగరంలోని వాసవి గార్డెన్స్ లో జబ్బారి రమణారెడ్డి కుమారుని పెళ్లి వేడుకల్లో పాల్గొన్నారు. పట్టు వస్త్రాలను కానుకగా సమర్పించి నిండు నూరేళ్లు చల్లగా ఉండాలని ఆకాంక్షించారు. అదేవిధంగా కారేపల్లిలో ఇమ్మడి తిరుపతి రావు ఇంట్లో జరిగిన ఉప్పలమ్మ వేడుకలో, ఖమ్మం నగరంలోని 60వ డివిజన్ రామన్నపేటలో జరిగిన పంచెకట్టు వేడుకకు హాజరై చిన్నారులను ఆశీర్వదించారు.

